RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 223 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం, ఫిబ్రవరి,28, 2026 | పేజీలు : 8  వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 223 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday, February,28,2026 | PAGES : 8  RS : 4 /- |




## మావోయిస్టుల కండిషన్స్


**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దేశంలో మావోయిస్టు పార్టీ తుది దశకు చేరుకుంది. అగ్ర నాయకులు ఒకరి తర్వాత ఒకరు.. లొంగిపోవడంతో మావోయిస్టు పార్టీ పరిస్థితి దారుణంగా మారింది. 1967లో పశ్చిమ బెంగాల్ లోని, నక్సల్ బరీలో పుట్టిన మావోయిస్టు ఉద్యమం.. ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ దెబ్బకు మావోయిస్టులు లొంగిపోవడం లేదా చచ్చిపోవడమో అన్నట్లుగానే, గత రెండు.. మూడు ఏళ్ల నుంచి కాలం గడుపుతూ వస్తున్నారు. ఇక తెలంగాణ ప్రభుత్వం మావోయిస్టులకు అండగా నిలబడటంతో.. పెద్ద ఎత్తున కీలక మావోయిస్టు నాయకులందరూ తెలంగాణ వచ్చి లొంగిపోయే ప్రయత్నం చేస్తున్నారు.



## ఢిల్లీ మద్యం కేసులో.. అభియోగాలే తప్ప ఆధారాలేవీ

- కేసును కొట్టివేస్తూ సిబిఐపై కోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- ఆధారాలు లేకుండా కేసు నడిపారని మండిపాటు
- కేజ్రీవాల, సిసోడియా, కవితలపై కేసు కొట్టివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి27 : ఢిల్లీ మద్యం లిక్కర్ పాలసీ కేసును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కొట్టి వేసింది. ఈ కేసులో దోషులుగా ఉన్న దిల్లీ మాజీ ముఖ్య మంత్రి కేజ్రీవాల్ , మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోది యా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత కు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించింది. సరైన ఆధారాలు లేకుండానే వీరి పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తంచే సింది. ఈ కేసులో పూర్తిగా లోపభూయి ష్టమైన దర్యాప్తు జరిగిందని కోర్టు సీబీఐపై మండిపడింది. ఈ విషయంలో సీబీఐ అధికారుల పైనే దర్యాప్తు జరగాలని కోర్టు పేర్కొంది. కవిత ఆడిటర్ బుచ్చి బాబు సహా అభియోగాలు మోపిన 23 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపింది. వారిపై ఉన్న అభియోగాలను నిరూపిం చడంలో సీబీఐ విఫలమైందని వ్యాఖ్యానించింది. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం ఊహాగా నాల ఆధారం గా ఈ కేసులో కుట్ర జరిగిందని సీబీఐ అధికారులు ఆరోపించారని న్యాయస్థానం పేర్కొంది. కానీ దానిని నిరూపించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎక్సైజ్ పాలసీపై ముగ్గురు న్యాయ నిపుణుల అభిప్రాయాలు తమ కేసుకు మద్దతు ఇస్తున్నాయని గతంలో సీబీఐ చేసిన ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.



## ట్రంప్‌తో మమ్దానీ భేటీ

**కొలంబియా విద్యార్థిని ఎల్లీ అఘాయేవా విడుదల**

- అధ్యక్షుడు ట్రంప్‌తో రాజకీయ నేత భేటీ తర్వాతే ఊరట
- పాలస్తీనా అనుకూల నిరసనలతో సంబంధం లేకపోయినా అరెస్ట్
- చదువు పూర్తి చేసేందుకు విద్యార్థినికి తాత్కాలిక అనుమతి మంజూరు

ఢిల్లీ,: అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారుల నిర్బంధంలో ఉన్న కొలంబియా యూనివర్సిటీ విద్యార్థిని ఎట్టకేలకు విడుదలయ్యారు. న్యూయార్క్ అసెంబ్లీ సభ్యుడు జోహ్రాన్ మమ్దానీ నేరుగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన తర్వాత ఆమె విడుదల కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.



## ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

**బకాయల కోసం రూ.745 కోట్లు విడుదల**
**ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిలు రూ.745 కోట్లు విడుదల చేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. విడతల వారీగా బకాయిలు విడుదల చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు తాజాగా బకాయిలు విడుదలయ్యాయి. మరోవైపు గ్రామ పంచాయతీలకు సైతం రూ.389 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

## పేదల ఇండ్ల కూల్చివేత ఆపాలి



- మోదీ ఇండ్లు కడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం కులుస్తుంది
- ముఖ్యమంత్రి తీరు మారకపోతే ప్రజలే గద్దె దింపుతారు
- రైతు భరోసా పేరుతో రైతాంగాన్ని మోసం చేస్తున్నారు
- రూ.27 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి
- కాళేశ్వరం అవినీతిపై విచారణకు కేంద్రం సిద్ధం
- కేంద్ర హో ం సహయ శాఖ మంత్రి బండి సంజయ్

కరీంనగర్,తెలంగాణ దిశ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదలకు ఇండ్లు నిర్మిస్తుంటే రాష్ట్రంలోని కాం గ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చడంలో పోటీ పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర విమర్శ లు చేశారు. కరీంనగర్ నగరంలోని 51వ డివిజన్‌లో రూ.16 లక్షల వ్యయంతో అభివృద్ధి పను లను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ..నానా కష్టాలు పడి పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం దుర్మార్గ మని మండిపడ్డారు.



## కన్నీరు పెట్టుకున్న కేజ్రీవాల్

- మోడీ, అమిత్ షాల కుట్రకు బలయ్యా
- నేను నిర్దోషినని కోర్టు నిరూపించంది
- నన్ను దొంగగా చిత్రీకరించి ప్రచారం చేశారు
- కోర్టు తీర్పుతో ఉద్వేగానికి లోనైన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి27 : ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న తనను ఆరు నెలలపాటు జైల్లో పెట్టారు. ఇదంతా మోడీ అమిత్ షాల కుట్ర అని, కోర్టు తీర్పు అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయంగా తనను దెబ్బతీయడంతో పాటు 'ఆప్‌కు చెందిన ఐదుగురు నేతలను జైల్లో పెట్టారు.**

నా జీవితంలో ఎన్నడూ తప్పు చేయలేదు. కేవలం విపక్షాలపైనే ప్రధాని మోదీ దృష్టి పెట్టారు. ప్రజా సమస్యలను మోదీ పట్టించుకోరు. నాపై ఎన్నో తప్పుడు కేసులు పెట్టారు. ఆమ్‌ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకు ప్రయత్నించారు. నేను అసలుసిసలైన నిజాయితీపరుడిని. నేను కేవలం ప్రజల కోసమే పనిచేశాను. నిజం ఎప్పటికైనా గెలుస్తుంది' అంటూ కన్నీరు పెట్టుకున్నారు.




## బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**
తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం ఆసక్తికరమైన మలుపు తిరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరాటాలు ప్రజాక్షేత్రంలో హోరెత్తుతుంటే, ప్రధాన ప్రతిపక్షంగా ఉండాల్సిన బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం పాటిస్తోందనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రధాన పోటీ తమ మధ్యే అన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు వీధి పోరాటాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. కామారెడ్డిలో మొదలైన నిరసన జ్వాలలు క్రమంగా రాష్ట్రమంతటా విస్తరించడం చూస్తుంటే.. ప్రజల్లో ఇతర ప్రత్యామ్నాయం లేదనే భావన కలిగించడం ఈ రెండు పార్టీల ఉమ్మడి ఎత్తుగడగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయి సమస్యలపై ఈ రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ వార్తల్లో నిలుస్తుండటంతో రాజకీయం అంతావారి చుట్టూనే తిరుగుతోంది. మరోవైపు బీఆర్ఎస్ అధినాయకత్వం ప్రస్తుతానికి కొంత వెనక్కి తగ్గినట్లు కనిపిస్తున్నా, అది ముందస్తు వ్యూహంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుబీజేపీ వైపు మళ్లకుండా ఉండేందుకు, అధికార పక్షం వైఫల్యాలను ఎండగట్టే సరైన సమయం కోసం వేచి చూసే ధోరణిని గులాబీ దళం అనుసరిస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా మళ్ళీ రేసులోకి రావాలని ప్లాన్ చేస్తోంది.



## మా పెళ్లి విందుకు రండి

**మోడీ అమిత్‌షాలను ఆహ్వానించిన విరోషా జంట**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి27 : గురువారం పెళ్లి చేసుకున్న హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న రిసెప్షన్ ఏర్పాట్లలో ఉన్నారు. గురువారం ఉదయం 10.10 గంటలకు మూడు ముళ్ల బంధంతో ఇద్దరూ ఒక్కటయ్యారు. ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్‌లో వీరి పెళ్లి జరిగింది. ఉదయం తెలుగు సంప్రదాయం ప్రకారం.. సాయంత్రం కొడవ సంప్రదాయం ప్రకారం పెళ్లి జరిగింది. ఈ పెళ్లికి అతి కొద్ది మంది బంధుమిత్రులను మాత్రమే ఆహ్వానించారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో చాలా గ్రాండ్‌గా రిసెప్షన్ నిర్వహించనున్నారు. రిసెప్షన్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. విజ య్, రష్మికలు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న రిసెప్షన్‌కు రావాలని ప్రధానికి ప్రత్యేక ఆహ్వానం అందించారు. అనంతరం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కలిశారు. పెళ్లి రిసెప్షన్‌కు రావాలని అహ్వానించారు. ఈ సందర్భంగా ఇన్విటేషన్‌తో పాటు వినాయకుడి విగ్రహాన్ని కూడా ఆయనకు అందించారు. విజయ్, రష్మికల జంట ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# టీఎస్ జెయు ఆధ్వర్యంలో హెల్మెట్ల పంపిణీ



**భూపాలపల్లి, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ) :** వాహన దారులు హెల్మెట్ వినియోగం తప్పని సరి చేసుకోవాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. శుక్రవారం గణపురం పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్ జెయు) భూపాలపల్లి కమిటి, వరంగల్ చక్రవర్తి హాస్పిటల్, శ్రీకాంత్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహన దారులు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్ని నియమ, నిబంధనలు విధించినా ప్రజలు వాటిని కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ఉందని అపుడే ప్రమాదాలు నివారించగలమని స్పష్టం చేశారు. ప్రతి వాహన దారుడు వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తో పాటు హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రాణం పోయిన తర్వాత బాధపడినా ఉపయోగం లేదని, ముందస్తు జాగ్రత్తలే ప్రాణాలను కాపాడుతాయని అన్నారు. వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చునేవారు కూడా విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎక్కడైనా వాహనాలు పట్టుకున్నప్పుడు తన పేరు చెప్పినా విడిచిపెట్టవద్దని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. సింగరేణి, ఎఎంఆర్, జెన్కో, మెగా తదితర సంస్థల ద్వారా మరిన్ని హెల్మెట్లు పంపిణీ చేయాలని కోరారు. చక్రవర్తి హాస్పిటల్ అధినేత డాక్టర్ తరుణ్ రెడ్డి 200 హెల్మెట్స్ వితరణ చేయాలని కోరగా ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారు. వ్యాపారవేత్తలు హెల్మెట్స్ వితరణ చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జనవరి మాసం మొత్తం రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడం అత్యంత ముఖ్యమని, ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ అనే సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఒక వ్యక్తి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం మొత్తం తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వేగ నియంత్రణ పాటించాలని, చలానా వేస్తారనే భయంతో కాకుండా ప్రాణ భద్రత కోసం హెల్మెట్ ధరించాలన్నారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వారికి పెట్రోల్ బంకుల్లో ఇంధనం ఇవ్వకూడదని సూచించారు. గత సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 6500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్లు తెలిపారు. రహదారి భద్రతను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జర్నలిస్టులు, ప్రైవేట్ వైద్యులు, శ్రీకాంత్ మిత్ర బృందం ప్రజల ప్రాణ రక్షణ కోసం హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. హెల్మెట్ వల్ల మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం వాహన దారులకు హెల్మెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సందాని, డిపిఆర్ఓ శ్రీనివాస్, డీఎస్పీ సంపత్ కుమార్, స్థానిక సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ , చక్రవర్తి హాస్పిటల్ వైద్యులు తరుణ్ రెడ్డి,తెలంగాణ స్టేట్ జర్నలిస్టుల సంఘం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్ , జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్ , ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్ , నాయకులు, శ్రీకాంత్ మిత్ర బృందం సుమన్ , ఇమ్రాన్ , నరేష్ , మహేష్ , వినయ్ , కిరణ్ , అభిలాష్ ప్రకాష్, భాను తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుండి హెల్మెట్ ధరించి వాహనం నడిపి అవగహన కల్పించారు.





## నిజాంపేట్ లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

### - ఎంపీని కోరిన బిజెపి శ్రేణులు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ)** :నిజాంపేట సర్కిల్ పరిధిలోని పలు బస్తీలలో విజృంభిస్తున్న దోమలను అరికట్టడానికి సర్కిల్ అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదంటూ శుక్రవారం బిజెపి నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ కు ఫిర్యాదు చేశారు. నిజాంపేట్ బిజెపి అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ ఈ సందర్భంగా ఎంపీకి సమస్యను వివరించారు. స్థానిక డంపింగ్ యార్డ్ మరియు చెత్త సేకరణ సరిగా లేకపోవడం కారణంగా దోమలు ఎక్కువగా పెరిగిపోయి స్థానికులను రోగాలు పాలు చేస్తున్నాయని వివరించారు. డంపింగ్ యార్డ్ చెత్త సేకరణ ప్రామాణికంగా జరిగే విధంగా తగిన చర్యలు తీసుకునేలా అధికారులతో మాట్లాడాలని ఆయన ఎంపీని కోరారు. సర్కిల్ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానంటూ ఎంపీ ఈటెల రాజేందర్ హామీ ఇచ్చారు. ఎంపీ ని కలిసిన వారిలో పాండు, రాజేష్ ముదిరాజ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య




కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ) :కుటుంబ కలహాలతో ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం షిరిడి హిల్స్ లో నివాసముండే దివ్య రెడ్డి ( 33) అలియాస్ జ్యోతి శుక్రవారం ఉదయం పరిమితికి మించి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. దివ్య రెడ్డికి గతంలో ఒక వివాహం జరిగి విడిపోయింది. రెండవ పెళ్లి చేసుకున్న భర్తతో ఆమెకు తరచూ మనస్పర్థలు తలెత్తి ఇంట్లో గొడవ జరిగేది. దీంతో ఆమె శుక్రవారం ఉదయం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంది. రెండవ భర్త నరసింహ వేదింపుల వల్లే తమ కూతురు దివ్య రెడ్డి ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె తల్లిదండ్రులు జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విజయవాడలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాల కలకలం

### - విచారణకు రాష్ట్ర ఐజీకి జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాలు

**విజయవాడ, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ)** :విజయవాడలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు వ్యవహారం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎన్‌సీఎస్సీ) ఆదేశాలు జారీ చేసింది.కేంద్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి. సునీల్ కుమార్ బాబు ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ, కారాగార, సరిదిద్దు సేవల ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు లిఖితపూర్వకంగా ఆదేశాలు పంపారు. 'నో యువర్ హ్యూమన్ రైట్స్' సంస్థ డైరెక్టర్, నో యువర్ రైట్ సొసైటీ అధ్యక్షుడు ఉమేష్ కుమార్ చేసిన ఫిర్యాదు మేరకు కమిషన్ ఈ చర్యలు తీసుకుంది. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా జరిగిన నియామకంపై సమగ్ర విచారణ చేపట్టి, 15 రోజుల్లోపు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని కమిషన్ స్పష్టం చేసింది. ఇదివరకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని కమిషన్ ఆదేశించినప్పటికీ, గడువు ముగిసినా నివేదిక సమర్పించలేదని పేర్కొంది. దీంతో మళ్లీ రిమైండర్ జారీ చేయాల్సి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారు ఉమేష్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజ్యాంగ సంస్థ ఆదేశాలను పట్టించుకోకపోవడం ఆందోళనకరమని, ఇది సామాజిక న్యాయ వ్యవస్థకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. రిజర్వేషన్ హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, విచారణను వేగవంతంగా పూర్తి చేసి పారదర్శకంగా నివేదిక సమర్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆలస్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే విషయాన్ని ఉన్నత రాజ్యాంగ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ ఘటనతో రిజర్వేషన్ విధానాల అమలు, కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియలపై మళ్లీ చర్చ మొదలైంది. విచారణ ఫలితాలపై అందరి దృష్టి నిలిచింది.




# అనుమతులు లేకుండా షెడ్ నిర్మాణం...

### ఘట్కేసర్ సర్కిల్ అక్రమాలకు అడ్డా? టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



**ఘట్కేసర్, జనవరి 27 (తెలంగాణ దిశ)** :ఘట్కేసర్ సర్కిల్ ప్రధాన రహదారి నుంచి సర్కిల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి ఆనుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా షెడ్ నిర్మాణం జరుగుతున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రజలు చూస్తుండగానే గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణ పనులు కొనసాగుతుండగా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ లేదా టౌన్ ప్లానింగ్ అనుమతులు లేవని తెలుస్తుంది. అయినప్పటికీ షెడ్ యజమాని "అంతా నా ఇష్టం" అన్నట్టుగా నిర్మాణ పనులు దర్జాగా కొనసాగిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉండే ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణం జరగడం వల్ల రహదారి విస్తరణ, ప్రజా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) టౌన్ ప్లానింగ్ విభాగం స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. తావిస్తోంది. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చే ముఖ్య విభాగమైన టౌన్ ప్లానింగ్ శాఖే అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో విఫలమైతే పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఘట్కేసర్ సర్కిల్–06 పరిధిలో డిప్యూటీ కమిషనర్, టీపీఓలు ఈ అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. సంబంధిత నిర్మాణ యజమానికి ఉన్న పరిచయాల కారణంగా అధికారుల మౌనం కొనసాగుతోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణంపై తక్షణమే విచారణ జరిపి, అనుమతులు లేని పనులను నిలిపివేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఘట్కేసర్ సర్కిల్‌లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడం కష్టమవుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

# తాగునీటి సమస్యలను పరిష్కరిస్తాం

### - సాయి నగర్‌లో జలమండలి డీజీఎం పర్యటన

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ)** :నిజాంపేట సర్కిల్ బాచుపల్లి పరిధిలోని సాయి నగర్‌లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై స్థానిక బిజెపి నాయకుల ఫిర్యాదుతో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ వినాయక్ శుక్రవారం ప్రాంతాన్ని సందర్శించారు. కాలనీలో కొత్తగా వేసిన తాగునీటి పైపులైన్ల అనంతరం చేపట్టాల్సిన రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పైపులైన్ల కోసం తవ్విన ట్రెంచ్‌లను సక్రమంగా బ్యాక్ ఫిల్లింగ్ చేయకపోవడం, రోడ్డు సర్ఫేస్ లెవెలింగ్ పూర్తిచేయకపోవడం వల్ల అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోయారు. పనులు పూర్తికాకపోవడంతో ఇప్పటికీ పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా ప్రారంభించలేదని తెలిపారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన డీజీఎం వినాయక్ సంబంధిత కాంట్రాక్టర్‌ను వెంటనే పిలిపించి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు పునరుద్ధరణ పనులను వెంటనే ప్రారంభించి, నూతన రహదారులు వేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే తాగునీటి సరఫరా త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో బిజెపి బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రగతి నగర్ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, నారాయణమూర్తి, గజ్జలు సంతోష్, కాసాని సంతోష్, భూపాల్ రెడ్డి, పావని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటా : ప్రొఫెసర్ కోదండరాం

### - కోదండరాంను కలిసిన రాష్ట్ర యూటీఎఫ్ కొత్త కార్యవర్గం



**హైదరాబాద్, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ)** :తెలంగాణ ఉద్యమకారుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరాంను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా టీయూఎఫ్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన ఓరుగంటి ఆనంద్‌ను ప్రొఫెసర్ కోదండరాం అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమ స్ఫూర్తితో దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం, గుర్తింపు అంశాల్లో ఎప్పటికప్పుడు అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఉద్యమ స్ఫూర్తి ఎప్పటికీ నిలిచేలా యువతలో చైతన్యం పెంపొందించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర టీయూఎఫ్ అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, వారికి న్యాయం జరిగేలా కృషి చేయడం తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యాయ వర్గం, ఉద్యమకారుల మధ్య సమన్వయం పెంపొందించేందుకు కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ మీడియా ఇంచార్జి తాడూరి గగన్ కుమార్, రాష్ట్ర నాయకురాలు జానకి రెడ్డి, ఉపాధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు కార్యనిర్వాహక కార్యదర్శి నరేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పబ్లిక్ పరీక్షల వేళ విద్యార్థులకు మానసిక అండగా టెలిమానస్ సేవలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ)** :జిల్లాలో కొనసాగుతున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని టెలిమానస్ సేవలను విస్తృతంగా అందుబాటులో ఉంచినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రకటించింది. పరీక్షల ఒత్తిడి, ఆందోళన, భయం వంటి మానసిక సమస్యలను ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఉచిత కౌన్సెలింగ్ అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు 14416, 1-800-891-4416 హెల్ప్‌లైన్ నెంబర్లకు కాల్ చేసి నిపుణులైన కౌన్సిలర్ల సలహాలు పొందవచ్చని వెల్లడించారు. ఈ సేవలు పూర్తిగా ఉచితం కాగా, గోప్యతకు పూర్తి భరోసా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి పరీక్షా కేంద్రంలో టెలిమానస్ పోస్టర్లు ప్రదర్శించబడుతున్నాయి. అవసరమైతే కాల్ చేసిన విద్యార్థులను ప్రత్యక్ష మానసిక ఆరోగ్య సేవలకు రిఫర్ చేసే సదుపాయం కూడా కల్పించబడిందని అధికారులు పేర్కొన్నారు. పరీక్షల అనంతరం ఫలితాల సమయంలో కూడా విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున టెలిమానస్ సేవలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సేవలను వినియోగించుకుని, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సి. ఉమాగౌరి సూచించారు.




జిల్లా వైద్యశాఖ ఈ చర్యల ద్వారా విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంపొందించి, పరీక్షలను సానుకూల దృక్పథంతో ఎదుర్కొనే వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు.

# రాజీవ్ గాంధీ నగర్‌లో శ్రీ నల్ల పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ)** :బాచుపల్లి పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న శ్రీ శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. కొలను హనుమంత రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో శాంతియుతంగా జీవనం గడపాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం తనవంతు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# సంపాదకీయం

## జెన్ జెడ్ చుట్టూ ప్రపంచం

జన్ జడ్.. ఇటీవల ఈ పదం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. బంగ్లాదేశ్, నేపాల్‌ల్లో ప్రభుత్వ మార్పుల్లో వీరి ప్రభావం కనిపించింది. ఇదే నేపథ్యంలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జెన్ జెడ్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మార్చి 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జెన్ జెడ్ థీమ్‌తో నిర్వహించనున్నారు. యువతను ఆకర్షించి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం. ఉద్యోగాలు, పారదర్శకత కోరే జెన్ జెడ్ ప్రజాస్వామ్యంలో మార్పులు తీసుకురాగలదా చూడాలి.ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యూత్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు కొన్ని వార్తా సంస్థలు తెలుపుతున్నాయి. ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఈ యువత తమ ప్రభావంతో స్థితిగతులను మార్చి వేస్తున్నట్లు కొందరు మేధావులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ప్రపంచం మొత్తం ఈ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో నేపాల్ రాజకీయాల్లో, బంగ్లాదేశ్ ప్రభుత్వం కూల్చడంలో ఉవని జి యూత్ ఎక్కువగా ప్రభావం చూపిందని తెలుస్తోంది. అయితే తాజాగా ఆంధ్రప్రదేశ్ లో జరిగిన జనసేన సమావేశంలో కూడా ఆ పార్టీ అధినేత మాట్లాడుతూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అన్నారు. దీంతో జెన్ జెడ్ ప్రభావం రాజకీయ రంగంలో ఎంత ఉందో అర్థమవుతుంది. అసలు ఈ జెన్ జెడ్ యూత్ అంటే ఎవరు?1997 నుంచి 2012 వరకు జన్మించిన వారు ఇప్పుడు యవ్వనంలోకి వచ్చారు. వీరిని జెన్ జెడ్ యూత్ అని అంటారు. ఈ యువత ఎక్కువగా సోషల్ మీడియాను ఉపయోగిస్తూ ఉంటుంది. సోషల్ మీడియాను ఉపయోగించడం మాత్రమే కాకుండా తమ అభిప్రాయాలను వెంటనే వ్యక్తం చేయడం.. సామాజిక పరిస్థితులపై విశ్లేషణ చేయడం.. తప్పు, ఒప్పు ల గురించి చర్చించడం తీవ్రమైంది. ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో సమాజంలో జరిగే పరిస్థితులపై వీరు వెంటనే తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అంతేకాకుండా ఎక్కడ ఏ చిన్న విభిన్న పరిస్థితి ఏర్పడిన దానిని వీడియో తీసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తారు. ఇలాంటి యూత్ వల్ల ప్రస్తుత ప్రపంచ పరిస్థితులపై ఎక్కువగా ప్రభావం పడుతుందని అంటున్నారు.గతంలో నేపాల్ లో యూట్యూబ్ కంటెంట్ పై పరిమితులు విధించడంపై యువత పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. వీరి ఆందోళనతోనే అక్కడి ప్రధాని దేశం విడిచి వెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడింది. అంటే సాధారణ ఉద్యమాలకు భిన్నంగా వీరి ఆందోళన తీవ్రతరంగా ఉంటుంది. ర్యాలీలు, సమావేశాల ద్వారా మాత్రమే కాకుండా సోషల్ మీడియా ద్వారా వీరి ఉద్యమాన్ని ఉదృతం చేస్తారు. ఒక సమాచారాన్ని చాలామందికి చేరవేయడంలో వీరి పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్ లోను అలజడి రేపిన యువత జెన్ జెడ్ యువతదే ఎక్కువ అని అంటున్నారు. తాజాగా పవన్ కళ్యాణ్ నిర్వహించిన జనసేన సమావేశంలోనూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అభిప్రాయ పడ్డాడు. వచ్చే ఆవిర్భావ సభలో జెన్ జెడ్ థీమ్ తో నిర్వహించాలని అన్నారు. వీరిని ఉపయోగించుకోవడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకోవచ్చని అన్నారు. ఇప్పటికే జనసేన పార్టీకి సోషల్ మీడియాలో అత్యధిక ఫాలోవర్స్ ఉన్నారు. వీరికి ఎక్కువగా ప్రాధాన్యతమిస్తే పార్టీ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నట్లు చెప్పారు. అయితే వచ్చే రోజుల్లో కూడా వీరి ప్రభావం మరింతగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు. మరో వైపు వత ఆకాంక్షలను ప్రభుత్వాలు విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. జెన్-జీ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రస్తుత తరం యువత (జెన్-జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దని కేటీఆర్ సూచించారు. సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలన్నారు. జెన్-జీ శక్తిని తక్కువ అంచనా వేయద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీ భూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతంగా పోరాడి ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందన్నారు. ఇదే జెన్-జీ పవర్ అన్నారు.సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని కేటీఆర్ సూచించారు. "రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు?" అని కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారతదేశం మాత్రం యవరక్తంతో ఉరకలెత్తుతోందన్నారు కేటీఆర్. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవన్నారు. అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితం అయితే,చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. ఇవాళ చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే అన్నారు. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుని మురిసిపోతున్నాం" అన్నారు.

# గీతాంజలి కళాశాలలో 'అరైవ్ అలైవ్' క్యాంపెయిన్ ఫేస్-2 అవగాహన




**కీసర, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ)** :కీసర మండలం చీర్యాలలోని గీతాంజలి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కీసర పోలీసులు శుక్రవారం 'అరైవ్ అలైవ్' క్యాంపెయిన్ ఫేస్-2 కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అర్వపల్లి ఆంజనేయులు, ట్రాఫిక్ సీఐ శివశంకర్, ఎస్ఐ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం, అధిక వేగంతో ప్రయాణించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే ప్రాణనష్టం, కుటుంబాలపై పడే ప్రభావం గురించి ఉదాహరణలతో వివరించారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి బాధ్యతాయుత పౌరుడిగా మారాలని పిలుపునిచ్చారు.

కళాశాల యాజమాన్యం పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. 'అరైవ్ అలైవ్' క్యాంపెయిన్ ఫేస్-2 ద్వారా యువతలో రోడ్డు భద్రతపై అవగాహన మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు.

# శారదా బస్ స్టాప్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

### - కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



**కుషాయిగూడ, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ)** :ఏఎస్ రావునగర్, నేరేడ్ మెట్ రోడ్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ఫిబ్రవరి 25 రాత్రి సుమారు 11.55 గంటలకు అవుల వెంకట్ రెడ్డి, ఆయన భార్య ఎ. ప్రమీల రాణి తమ మోటార్ సైకిల్‌పై నేరేడ్ మెట్ వైపు నుండి ఏఎస్ రావునగర్ వైపు వస్తున్నారు. శారదా బస్ స్టాప్ జంక్షన్ వద్ద (రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా) కుడి మలుపు తిరుగుతున్న సమయంలో ఒక కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ప్రమీల రాణి అపస్మారక స్థితిలో ఈసీఐఎల్‌లోని శ్రీకర హాస్పటల్ ఎమర్జెన్సీ వార్డులో చేరారు. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. అవుల వెంకట్ రెడ్డికి ఎడమ కాలు విరగడంతో చికిత్స పొందుతున్నారు.ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దర్యాప్తులో కారు నడిపిన వ్యక్తి దొడ్డల తరుణ్ (31), నేరేడ్ మెట్ సాయినాథ్‌పురం నివాసి అని గుర్తించారు. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 27 మధ్యాహ్నం సుమారు 4 గంటలకు చికిత్స పొందుతూ శ్రీమతి ప్రమీల రాణి మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో కేసును పోలీసులు మరింతగా దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, తదుపరి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

# సమస్య మీది - పరిష్కారం మాది : నెమలి అనిల్ కుమార్

### - భరత్ నగర్ కాలనీలో 'బస్తీ బాట' కార్యక్రమం



**మల్లాపూర్,ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ)** :ఉమ్మడి మల్లాపూర్ శక్తిసాయి నగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీలో శుక్రవారం "బస్తీ బాట"కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ కాలనీలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల దుస్థితి, దోమల సమస్య, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక సదుపాయాల లోపాలపై ప్రజలు వివరించారు. వాటిని శ్రద్ధగా విన్న నెమలి అనిల్ కుమార్ సంబంధిత ఉన్నతాధికారులతో వెంటనే చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన పనిచేస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో భరత్ నగర్ కాలనీలో ఉన్న ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని నెమలి అనిల్ కుమార్ హామీ ఇచ్చారు. సమస్య మీది, పరిష్కారం మాది అనే నినాదంతో ప్రజలకు భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సద్గుణ, మల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, వుండం శ్రీనివాస్, లక్ష్మీపతి, సురేష్ గౌడ్, కంపెల్లి శివ, ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు బాతరాజు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



# యెస్ బ్యాంక్‌లో 13.18% వాటా విక్రయించిన ఎస్‌బీఐ

యెస్ బ్యాంక్‌లో 13.18% వాటాను జపాన్ సంస్థ సుమిటోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ)కు విక్రయించడాన్ని పూర్తిచేసినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బుధవారం ప్రకటించింది.ఈ లావాదేవీ విలువ రూ.8,888.97కోట్లు. సుమిటోమో మిత్సుయ్ ఫైనాన్షియల్ గ్రూప్ (ఎస్ఎంఎఫ్‌జీ)కు చెందిన ఆర్థిక సేవల విభాగమైన ఎస్ఎంబీసీ నుంచి ఈ మొత్తాన్ని అందుకున్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఎస్‌బీఐ పేర్కొంది. యెస్‌బ్యాంకులో రూ.688 కోట్ల విలువైన వాటాలను ఎస్ఎంబీసీకి ఫెడరల్ బ్యాంక్, బంధన్ బ్యాంక్ విక్రయించాయి.యెస్ బ్యాంక్‌లో 15.39 కోట్ల షేర్లను ఎస్ఎంబీసీకి రూ.331 కోట్లకు బంధన్ బ్యాంక్ విక్రయించింది. దీంతో యెస్ బ్యాంక్‌లో బంధన్ బ్యాంక్ వాటా 0.7% నుంచి 0.21 శాతానికి తగ్గింది.

# హిందువుల ఐక్యతే సమాజ బలం

### బజరంగ్ దళ్ జాతీయ అధ్యక్షుడు కిషన్ ప్రజాపతి - సాయిదామంలో బజరంగ్ దళ్ శిక్షణ వర్గ ఏర్పాట్లపై సమీక్ష

### కుషాయిగూడలో 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని సందర్శన ..







**కుషాయిగూడ, ఫిబ్రవరి 27, (తెలంగాణ దిశ):** మార్చి 7 నుంచి 14 వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సాయిదామంలో నిర్వహిం చనున్న అఖిలభారత బజరంగ్ దళ్ శిక్షణ వర్గ (శిబిరం) ఏర్పాట్ల పరిశీలన, సమీక్ష కార్యక్ర మం శుక్రవారం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా అఖిలభారత బజరంగ్ దళ్ జాతీయ అధ్యక్షులు కిషన్ ప్రజాపతి కుషాయిగూడకు విచ్చేసి శిబిర ఏర్పాట్లపై నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ బస్ స్టాప్ సమీపంలో నిర్మాణంలో ఉన్న 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం కుషాయిగూడ శివాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి యువత ధర్మ మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండించారు. 'లవ్ జిహాద్' పేరుతో హిందూ యువతులను లక్ష్యంగా జరుగుతున్న సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హిందువులను కులాల వారిగా విభజించి ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ హిందువులంతా సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత్ బజరంగ్ దళ్ సంయోజక్ కుమారస్వామి, తెలంగాణ విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు రమేష్ బాబు, తెలంగాణ రాష్ట్ర బజరంగ్ దళ్ సంయోజక్ శ్రీకాంత్, భాగ్యనగర్ సంయోజక్ విశాల్, బజరంగ్ దళ్ మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షులు, బిజెపి చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్, కుషాయిగూడ ప్రఖండ ప్రముఖ సాకేత్ అరుణ్, యశ్వంత్ సాగర్, రాగిరి వరుణ్ సాకేత్, బీజేపీ నాయకులు సురేందర్ గౌడ్, ఆనంద్ గౌడ్, రేగొండ వెంకులు, లక్ష్మణ్ గౌడ్, గణేష్ గౌడ్, వెంకటాచలం, జీవీఎన్ రావు, సంపత్ రావు, సహదేవ్ గౌడ్, పిట్టల రాజు, దయానంద్, అప్పి, శ్రీకాంత్, శ్రీధర్, సోమేశ్ నాయుడు, కళావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మెరుగు చంద్రమోహన్ ను కిషన్ ప్రజాపతి ఘనంగా సన్మానించారు.

# రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా రుషికొండ భవనాలు

విశాఖపట్టణం: ఎన్నికలకు ముందు అదే రచ్చ. ఎన్నికలు అయిపోయి..15 నెలలు అవుతున్నా..ఆ భవనాల చుట్టే ఏపీ పాలిటిక్స్ చక్కర్లు కొడుతున్నాయి.ఆ కట్టడాలు వైసీపీకి చేయాల్సినంత డ్యామేజ్ చేశాయి. కూటమికి కావాల్సినప్లస్ పాయింట్‌గా మారాయి.అయినా ఇప్పటి వరకు రుషికొండ భవనాలు రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా ఉండిపోతున్నా యి. ప్రతీ నెల రోజులకోసారి ఏదో విధంగా సాగరతీరంలో వైసీపీ హయాంలో కొండను తవ్వేసి కట్టిన కట్టడాల మీదే డిస్కషన్ నడుస్తోంది.ఇప్పుడు మరోసారిలైమ్‌లైట్‌లోకి వచ్చేసింది రుషికొండ ఇష్యూ. విశాఖ సాగర తీరాన వైసీపీ హయాంలో కట్టిన రుషికొండ భవనాల రచ్చ క్లైమాక్స్‌కు చేరేలా కనిపిస్తోంది. సర్కార్ క్యాబినెట్ సబ్‌కమిటీ చర్చలు స్టార్ట్ చేయడంతో..రుషికొండ నిర్మాణాలను దేనికి యూజ్ చేస్తారనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. రుషికొండ భవనాలను ఏపీ సర్కార్ ఏం చేయబోతోంది?ప్రభుత్వమే వాడుకుం టుందా? రిసార్టులు, హోటల్స్ కోసం రెంట్‌కు ఇస్తారా? సబ్ కమిటీ సూచనలు ఎలా ఉండబోతున్నాయి? భవనాలను మెంటల్ హాస్పిటల్ గా మార్చాలని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు వంటి వాళ్లు ప్రతిపాదించడం హాట్ టాపిక్ అవుతోంది.మంత్రివర్గ ఉపసంఘం

భేటీ అయ్యి.. రుషికొండ భవనాలను ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై చర్చించింది. ఎలాంటి ఉపయోగం లేకుండా ఉన్న రుషికొండ కట్టడాలతో నెలకు రూ.25 లక్షలు విద్యుత్ ఛార్జీలు, మెయింటనెన్స్ ఖర్చులు భరించాల్సి వస్తోందని చెబుతోంది ప్రభుత్వం. గతంలో రూ.7 కోట్లు ఆదాయం వచ్చే చోట ఇప్పుడు ప్రభుత్వం ఎదురు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు మంత్రులు. రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ప్రజాభిప్రాయాలు కోరుతూ ప్రకటన ఇవ్వాలని, ప్రజల అభిప్రాయం ప్రకారం డెసిషన్ తీసుకోవాలి క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. హోటల్స్ నిర్వహణ, మానసిక వికలాంగుల చికిత్సాలయ ఏర్పాటు చేయాలంటూ వచ్చిన ప్రతిపాదనలు, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తోందట. అయితే ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతే రుషికొండ భవనాలపై ఓ నిర్ణయానికి రావాలని భావిస్తున్నారట.రుషికొండ భవనాలను విషయంలో కూటమి టార్గెట్‌గా వైసీపీ. జగన్ ఫ్యామిలీ సాగర తీరంలో సేద తీరేందుకు..అద్భుతమైన ప్యాలెస్ కట్టారని ముందు నుంచి ఆరోపిస్తూ వస్తోంది కూటమి.

# ఇది వలస జీవుల గాథ



పౌరసత్వం అనేది సాధారణంగా ఒక వ్యక్తి నిర్దిష్ట భూభాగంలో నివసించడంతో అనుసంధానించబడింది. పౌరుడు సాధారణంగా ఒక నిర్దిష్ట ప్రాంతంలో నివసిస్తూ ఉంటాడని భావిస్తారు. కానీ అంతర్జాతీయంగా గానీ, దేశం లోపల గానీ సరిహద్దులు దాటి ప్రజలు వలస వెళ్లడం వల్ల పౌరసత్వం-భూభాగం మధ్య ఉన్న ఈ అనుసంధానం సడలిపోతోంది. దీనితో పౌరసత్వం పట్ల ఉన్న మౌలిక అవగాహనలో గందరగోళం ఏర్పడుతోంది. ప్రభుత్వాలు గానీ, రాజకీయ పార్టీలు గానీ దీనిని పూర్తిగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేవు. ఫలితంగా, ప్రపంచవ్యాప్తంగా ఇటీవల వలసదారులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు, భారీగా నిర్బంధ బహిష్కరణలకు పూనుకోవడం, ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడం వంటి ప్రక్రియలు ఊపందుకున్నాయి. భారతదేశంలో, ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ఓటర్ల జాబితాలపై ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపడుతోంది.

ఈ ప్రక్రియను సవాల్ చెయ్యడంతో ఇసిఐ సుప్రీంకోర్టుకు ఇలా తెలిపింది: "వేగవంతమైన పట్టణీకరణ, విద్య, జీవనోపాధి తదితర అవసరాల కోసం ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరచూ వలస వెళ్లడం ఇప్పుడు అత్యంత సాధారణంగా మారింది.

కొందరు ఓటర్లు ఒక చోట నమోదు చేసుకుని, తరువాత తమ పేర్లు అక్కడి ఓటర్ల జాబితా నుంచి తొలగించుకోకుండా మరోచోటకు మారి మళ్లీ అక్కడ నమోదు చేసుకుంటున్నారు. దీనివల్ల ఓటర్ల జాబితాలో పేర్లు పునరావృతం అయ్యే అవకాశాలు పెరిగాయి. అందువల్ల బీహార్‌తో ప్రారంభించిన ఎస్ఐఆర్ ను పాన్-ఇండియా స్థాయిలో నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇసిఐ నిర్ణయించింది."

అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనలో, ఫెడరల్ ఎన్నికల చట్టాలను అమలు చేయడానికి పూర్తి ఓటరు జాబితాలు అవసరమని వాదిస్తూ న్యాయ శాఖ దేశంలోని 50 రాష్ట్రాల నుంచి ఓటరు నమోదు డేటాబేస్‌లను ఇవ్వాలని కోరింది. ఈ ఆదేశాలను అనేక రాష్ట్రాలు ప్రతిఘటించాయి. ఇదే సమయంలో, అమెరికా పౌరసత్వానికి సంబంధించిన పాస్‌పోర్ట్ లేదా జనన సర్టిఫికెట్ వంటి పత్రాల ఆధారాలు తప్పనిసరి చేసేలా ఫెడరల్ ఎన్నికల విధానాలను మార్చాలని ట్రంప్ ఒక విస్తృత కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. దీని మూలంగా ఎన్నికల సమగ్రత, విశ్వసనీయత బలపడుతుందని అనుకూలురు వాదిస్తుండగా, విమర్శకులు మాత్రం రాష్ట్రాల స్వయంప్రతిపత్తి దెబ్బ తింటుందని, ఓటర్ల హక్కులు పరిమితం అవుతాయని హెచ్చరిస్తున్నారు. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న విదేశీయులు (పౌరులు కానివారు) సుమారు 2.2-2.4 కోట్ల మంది ఉన్నారు. అక్రమ వలసదారుల సంఖ్య అంచనాల ప్రకారం మిలియన్లలో ఉంది. భారత్, అమెరికా రెండింటిలోనూ 'విదేశీ ఓటర్లు' రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారనే భావన బలంగా ప్రచారంలో పెట్టారు.

పెరుగుతున్న వలసలు: ప్రపంచ జనాభాలో అంతర్జాతీయ వలసదారుల శాతం దశాబ్దాలుగా పెద్దగా మారకపోయినా, వారి సంఖ్య మాత్రం వేగంగా పెరిగింది. 1960 నుంచి వలసదారుల శాతం సుమారు ఒక శాతం పాయింట్ మాత్రమే పెరిగిందని అంచనాలు చెబుతున్నాయి. కానీ స్వదేశం వెలుపల నివసించే వారి సంఖ్య 1990లో సుమారు 15.4 కోట్ల నుంచి 2024 మధ్య నాటికి 30 కోట్లకు పైగా పెరిగింది. అంటే కేవలం మూడు దశాబ్దాల్లో దాదాపు రెండింతలు, మొత్తం ప్రపంచ జనాభా వృద్ధి కంటే వేగంగా పెరిగింది.పాశ్చాత్య దేశాల్లో స్థిరపడిన విదేశీయుల సంతానం వాటా పెరగడంతో స్థానికతవాదం పెరుగుతోంది. అమెరికా జనాభాలో విదేశాల్లో పుట్టినవారు సుమారు 14-15 శాతం ఉండగా, 2010లో ఇది సుమారు 13 శాతం మాత్రమే. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఈ మార్పు మరింత గణనీయంగా ఉంది.

2001లో సుమారు 8 శాతంగా ఉన్న విదేశాల్లో జన్మించిన వారి వాటా 2021 నాటికి దాదాపు 16 శాతానికి పెరిగింది. పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటైన కెనడాలో ఈ శాతం సుమారు 22 శాతంగా ఉంది. ఆస్ట్రేలియాలో అయితే దాదాపు 31-32 శాతం జనాభా విదేశాల్లో పుట్టినవారే. 2025 నాటికి అభివృద్ధి చెందిన దేశాల్లో ఓటర్లకు ఎదురయ్యే ముఖ్యమైన మూడు అంశాల్లో వలస ఒకటిగా ఉంటుంది, అయితే దాని తీవ్రత కొంత తగ్గింది.

ప్రభుత్వాలు ప్రజల వలసలను నియంత్రించాలని భావిస్తున్నాయి. భారత్ 'మానవ వనరులను ఎగుమతి చేయాలని' (అంటే ఉద్యోగాల కోసం మరింత మందిని విదేశాలకు పంపాలని) ఆశిస్తోంది. యువ కార్మికుల సేవలు అవసరమైన ధనిక దేశాలు, వారు అక్కడే ఉండి పౌరసత్వం పొందకుండానే, కొన్నేళ్ల తర్వాత తిరిగి వెళ్లిపోవాలని కోరుకుంటున్నాయి. తిరిగి వచ్చే వలసదారులు కొత్త సామాజిక, రాజకీయ దృక్పథాలను తీసుకు వస్తారు. ఆతిథ్య దేశాల్లో వారు

రాజకీయ హక్కులు లేని కార్మిక వర్గంగా, అమెరికా లోని హెచ్-1బి వీసా కార్మికుల మాదిరిగా, మారతారు. అయితే వారికి సమీప భవిష్యత్తులో పౌరసత్వం పొందే మార్గం ఉంటుంది. గల్ఫ్ సహకార మండలి (జిసిసి) దేశాలు, సింగపూర్‌లు కూడా రాజకీయ అస్థిత్వం లేని కార్మిక వర్గాన్ని సృష్టించాయి. అభివృద్ధి చెందిన దేశాలు కూడా తాత్కాలిక కార్మికుల విషయంలో ఇదే దిశగా ఆలోచిస్తున్నాయి. సుమారు 3.54 కోట్ల మంది ఓవర్సీస్ ఇండియన్లు ఉన్నారు. వారిలో 1.58 కోట్ల మంది భారత పౌరులు,

1.96 కోట్ల మంది భారతీయ మూలాలు ఉన్న వారు. 2010లో చేసిన ప్రజా ప్రతినిధ్య (సవరణ) చట్టం ప్రకారం, విదేశాల్లో నివసిస్తున్న భారత పౌరులు తమ పాస్ పోర్ట్‌లో పేర్కొన్న భారత నివాస చిరునామా దగ్గర ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. అయితే, వారు విదేశాల నుంచే ఓటు వేయడానికి అనుమతించాలంటూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ విచారణలో ఉంది. 2010 సవరణ ఒకవైపు ఓటు హక్కు ఇచ్చి, మరోవైపు దాన్ని వినియోగించడానికి భారతదేశంలో భౌతికంగా హాజరు కావాలని షరతు విధించడం ద్వారా ఎన్నారైలను అన్యాయానికి గురి చేస్తోందని పిటిషనర్ వాదిస్తున్నారు.

వలసలు, విధానాలు: భారత ప్రభుత్వ విధానాలు గ్రామాల నుంచి పట్టణాలకు, అలాగే కాశ్మీర్ వంటి నిర్దిష్ట ప్రాంతాలకు వలసలను ప్రోత్సహించాయి. 2020లో జమ్మ-కాశ్మీర్‌లో డొమిసైల్ నిబంధనలను సడలించి, 10 సంవత్సరాలు పోస్టింగ్ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, 15 సంవత్సరాలు నివసించిన వారు,

ఏడేళ్లు చదివిన విద్యార్థులు వంటి స్థానికేతరులకు డొమిసైల్ హోదా కల్పించారు. తద్వారా వారికి ఉద్యోగాలు పొందే హక్కు, ఆస్తులు కొనుగోలు చేసుకునే హక్కులు లభించాయి. ఇది స్థానిక జనాభా పొందికను మార్చే ప్రయత్నమని విమర్శకులు వాదిస్తుండగా, ప్రభుత్వం అభివృద్ధి, సమగ్రత కోసమేనని చెబుతోంది.

దేశ సరిహద్దుల లోపల కూడా అంతర్గత సరిహద్దులు ఉన్నాయి. వాటిని దాటి వలసలు రాజకీయ, పాలనాపరమైన ప్రభావాలను చూపుతాయి. డొమిసైల్ చట్టాలు అనేక విద్యా, ఉద్యోగ అవకాశాలను ఆ రాష్ట్రం లేదా ప్రాంతానికి చెందిన వారికే పరిమితం చేస్తాయి. దేశంలో సాగుతున్న అంతర్గత వలసల కీలక ప్రభావం ఓటు హక్కుపై ఉంటుంది. ఓటు హక్కు సాధారణంగా ఒక పౌరుడు నివసించే పోలింగ్ బూత్‌కు అనుసంధానించబడింది. ఎస్ఐఆర్ అనేది ఎవరు ఓటు వేయగలరు అనే నిర్ణయం మాత్రమే కాదు. మరింత ముఖ్య ంగా, ఎక్కడ ఓటు వేయగలరనే ప్రశ్నకు కూడా సమాధానం. వలసలను స్వీకరించే మహారాష్ట్ర, కేరళ వంటి రాష్ట్రాల్లో ఒక వ్యక్తి ఓటు వేయడం, వలసలను పంపించే బీహార్ వంటి రాష్ట్రంలో ఓటు వేయడంలా కాకుండా జాతీయ రాజకీయాలపై భిన్న ప్రభావాలను చూపుతుంది. జనాభా కూర్పులో మార్పులు రాజకీయాలను ప్రభావి తం చేస్తాయి. ముంబైలో ఇప్పుడు మరాఠీ మాట్లాడేవారు 40 శాతం కన్నా తక్కువగా ఉండగా, హిందీ మాట్లాడేవారు సుమారు 30 శాతం ఉన్నారు. శివసేన స్థానిక అస్థిత్వ రాజకీయాలు బలహీన పడ్డాయి. ఇప్పుడు రాజకీయ పార్టీలు తరచుగా హిందీ మాట్లాడే అభ్యర్థులను ఎన్నికల్లో నిలబెడుతున్నాయి. 2001లో భారత జనా భాలో 31 శాతం మంది వలసదారులు కాగా, 2011 నాటికి ఇది 38 శాతానికి పెరిగింది. వీరిలో మూడింట రెండు వంతులు మహిళలే. వీరి విషయంలో వివాహం ప్రధాన కారణంగా ఉన్నది. మిగిలిన మూడవ వంతు పురుషులు ప్రధానంగా ఆర్థిక కారణాల వల్ల దూరప్రాంతాలకు వలస వెళ్తారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత జరగనున్న 2027 జనగణన ఈ విస్తృత కదలికల పరిమాణాన్ని పట్టుకోనుంది.

వలస వెళ్లే ప్రజలు తమ దృక్పథాలు, విలువలు, కథలు, విశ్వాసాలను కూడా తీసుకువెళ్తారు. వైట్‌హౌస్ ఇప్పుడు దీపావళిని జరుపుకుంటోంది. ఇది 2003లో ప్రారంభమైన ఆచారం.

వలసల ద్వారానే వేద సంప్రదాయాలు ఆర్యావర్త ప్రాంతం నుంచి తూర్పు, ద్వీపకల్ప ప్రాంతాలకు విస్తరించి, అక్కడ అప్పటికే వున్న కథలతో కలిసి, తరువాత హిందూయిజం అని పిలవబడిన సాంస్కృతిక విశ్వాన్ని విస్తరించాయి. భాషలు కూడా వలసలతో పాటు కదులుతాయి. చరిత్రలో సాధారణంగా మహిళల కంటే పురుషులే ఎక్కువగా వలస వెళ్లారు. వలస వచ్చిన పురుషులు స్థానిక మహిళలను వివాహం చేసుకున్నారు. నేడు మనం మాట్లాడే భాషల్లో ఈ చరిత్ర ప్రతిబింబిస్తుంది అని పెగ్గీ మోహన్ తన ఫాదర్ టంగ్, మదర్‌ల్యాండ్‌లో వాదిస్తారు.

జన్మత: పౌరసత్వం: వలసల పెరుగుదల ప్రశ్నించడానికి వీలు లేని జన్మత: పౌరసత్వం అన్న భావనకే సవాలు విసురుతోంది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం అమెరికాలో పుట్టిన ప్రతి ఒక్కరికీ పౌరసత్వం ఉంటుందనే దీర్ఘకాలిక విధానాన్ని ట్రంప్ పాలనా యంత్రాంగం సవరించాలని ప్రయత్నిస్తోం ది. బిడ్డలను కనడం కోసం ఇటీవలి వరకు సుమారు 30 వేల మంది ప్రతి సంవత్సరం అమెరికాకు ప్రయాణించేవారు.



## ఈ రెండు గ్రామాలు సేమ్ టు సేమ్

**కోరుట్ల,తెలంగాణ దిశ :** ఆ రెండు గ్రామాలు కవలల్లాగా ఒకేలా కనిపిస్తాయి. వీధుల నుంచి విగ్రహాల దాకా, భౌగోళికంగా చూసినా.. నిర్మాణాల పరంగా చూసినా దాదాపుగా ఒకేలా ఉంటాయి. ఆ రెండు ఊళ్లలో ఏ ఊళ్లోకి అడుగుపెట్టినా కొత్తవారు ఆశ్చర్యపోవడం ఖాయం.. అవే కరీంనగర్ జిల్లా కోరుట్ల మండలంలోని గుంలాపూర్, వెంకటాపూర్ గ్రామాలు. జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉండే ఈ గ్రామాల మధ్య ఉన్న ఈ సారూప్యతలు అటుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి. గుంలాపూర్‌లో అడుగుపెట్టే వారికి అంబేద్కర్ విగ్రహం స్వాగతం పలుకుతుంది. కాస్త ముందుకు వెళితే పంచాయతీ ఆఫీసు, చెరువు, దాని ఒడ్డున ప్రభుత్వ పాఠశాల ఉన్నాయి. ఇదేవిధంగా వెంకటాపూర్ గ్రామంలోకి ప్రవేశించాక మహా త్మా గాంధీ విగ్రహం స్వాగతిస్తుంది. ఎడమ వైపు పంచాయతీ ఆఫీసు, దాని వెనకనున్న కాలనీ మీదుగా వెళ్తే చెరువు, దాని ఒడ్డున ప్రభుత్వ పాఠశాల ఉన్నాయి.

రెండు గ్రామాల్లోనూ శివార్లలో రెండు గుట్టలు, వాటిపై శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు కనిపిస్తాయి. గుంలాపూర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా ఫిబ్రవరిలో భీష్మ ఏకాదశి సందర్భంగా వారం రోజులు ఉత్సవాలు జరుగుతాయి. వెంకటాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా కార్తికమాసంలో వారం రోజుల పాటు శ్రీవారి బ్ర హ్మోత్సవాలు జరుగుతాయి. రెండేళ్ల కిందట వెంకటాపూర్ లో గ్రామ యువకులు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా.. తాజాగా గుంలాపూర్ యువకులు కూడా తమ గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

# మెట్రో టేకోవర్ ప్లాన్ సిద్ధం!



**హైద్రాబాద్,తెలంగాణ దిశ :**హైదరాబాద్ వాసుల జీవననాడి, ప్రతి రోజూ లక్షల మందిని గమ్య స్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రో రైలు చరిత్రలో ఒక భారీ మార్పు చోటు చేసుకోబోతోంది. ఇప్పటి వరకు పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ పద్ధతిలో ఎల్ అండ్ టీ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి స్థాయిలో తన ఆధీనంలోకి తీసుకోవాలని సంచలన నిర్ణయం తీసుకుంది. కేవలం నిర్ణయం తీసుకోవడమే కాకుండా, ఈ ప్రక్రియను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాలని గడువు విధించుకోవడం ఇప్పుడు నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. మెట్రో రైలు టేకోవర్ ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా భావిస్తున్న ప్రభుత్వం దాన్ని మార్చి 31 నాటికి పూర్తి చేయాలని చూస్తోంది. ఈ భారీ బదిలీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఇప్పటికే కార్యదర్శులు స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ ఇటీవల ఎల్ అండ్ టీ ఉన్నతాధికారులతో ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి, ప్రాజెక్టు బదిలీలో ఎదురయ్యే సవాళ్లు, పరిష్కారాలపై లోతుగా చర్చించింది. ప్రభుత్వం లక్ష్యం స్పష్టంగా ఉంది. ఏప్రిల్1 నాటికి మెట్రో రైలు కార్యకలాపాలు ప్రభుత్వ పర్యవేక్షణలోకి వచ్చేలా సర్వ సిద్ధం చేయడం. ఆర్థిక, న్యాయ చిక్కులు లేకుండా ఐడీబీఐ కసరత్తు: వేల కోట్ల రూపాయల ప్రాజెక్టును ఒక ప్రైవేటు సంస్థ నుంచి ప్రభుత్వం తీసుకోవడం అనేది సామాన్యమైన విషయం కాదు.

ఇందులో అనేక ఆర్థిక, న్యాయపరమైన మెలికలు ఉంటాయి. వీటికి పరిష్కరించడానికి ప్రభుత్వం ఐడీబీఐ సంస్థను ఫైనాన్స్, లీగల్ అడ్వైజర్‌గా నియమించింది. సమాచారం ప్రకారం ఐడీపీఐ సంస్థ ఇప్పటికే సమగ్రమైన నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేసింది. ఎల్ అండ్ టీ సంస్థకు ప్రభుత్వం ఎంత మొత్తం చెల్లించాలి, బకాయిల పరిస్థితి ఏంటీ, ఒప్పంద పత్రాల్లోని నిబంధనలు ఎలా ఉన్నాయి అనే అంశాలై ఈ నివేదికలో స్పష్టత ఇచ్చినట్టు తెలుస్తోంది.

ఈ రిపోర్టు ఆధారంగానే హెచ్ఎంఆర్ఎల్, ఎల్ అండ్ టీ ప్రతినిధులు అంతిమ ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. టెక్నికల్ కన్సల్టెంట్ నియామకం: ఇంజనీరింగ్అద్భుతంపై ఆడిట్ మెట్రో అనేది కేవలం రవాణా వ్యవస్థ మాత్రమే కాదు, అది ఒక సంక్లిష్టమైన సాంకేతిక వ్యవస్థ.నిర్మాణం నుంచి ఆపరేషన్స్ వరకు ప్రతి అడుగులోనూ సాంకేతికత కీలకం అందుకే మెట్రో ప్రాజెక్టు నిర్మాణ నాణ్యత, ప్రస్తుత నిర్వహణ తీరు, రైళ్ల ఆపరేషన్స్ వంటి కీలక అంశాలను అంచనా వేయడానికి ప్రభుత్వం క టెక్నికల్ కన్సల్టెంట్‌ను నియమించలని నిర్ణయించింది. ఈ నియామక ప్రక్రియ మరో వారం రోజుల్లో పూర్తికానుంది. ఈ కన్సల్టెంట్ ఇచ్చే సాంకేతిక నివేదిక, ఐడీబీఐ ఇచ్చిన ఆర్థిక నివేదికతో కలిపి మెట్రో టేకోవర్ ప్రక్రియకు ఒక పూర్తి స్థాయి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తుంది. ప్రజలకు కలిగే ప్రయోజనం ఏంటీ? ప్రభుత్వ నిర్ణయం వెనుక లోతైన వ్యూహం కనిపిస్తోంది.

మెట్రో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి వస్తే టికెట్ ధరల నియంత్రణ, మెట్రో రెండో దశ విస్తరణ పనుల్లో వేగం,ఇతర ప్రజా రవాణా వ్యవస్థలతో మెట్రోను అనుసంధానించడం సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సెకండ్ ఫేజ్ పై పెండింగ్ : దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం మోడల్‌లో నిర్మించిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలంటే సుమారు రూ.15,000 కోట్ల నుంచి రూ.18,000 కోట్ల వరకు నిధులు అవసరమని అంచనా. ప్రాజెక్టు అప్పులు, ఎల్ అండ్ టీ పెట్టుబడి, ఇతర నిర్వహణ ఖర్చులను లెక్కగడితే ఈ మొత్తం భారీగా ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌పై ఒత్తిడి ఉన్న సమయంలో , కేంద్ర ప్రభుత్వ సహాయం కోరాలా లేక విదేశీ రుణ సంస్థల ద్వారా నిధులు సమీకరించాలా అనే అంశంపై ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. మెట్రో ప్రాజెక్టు ప్రభుత్వ చేతుల్లోకి వస్తే, రెండో దశ విస్తరణ పనులు మరింత వేగవంతం అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. విమానాశ్రయ మార్గం, పాతబస్తీ మెట్రో వంటి కీలక మార్గాల్లో నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వానికి సులభతరం అవుతుంది. ప్రైవేట్ భాగస్వామి నిబంధనల అడ్డంకులు లేకుండా, ప్రభుత్వం సొంతంగా నిధులు కేటాయించి నగరం నలుమూలలా మెట్రోను విస్తరించే అవకాశం ఉంటుంది.హైదరాబాద్ మెట్రో స్వాధీనం అనేది కేవలం ఒక వ్యాపార లావాదేవీ మాత్రమే కాదు, ఇది నగర ప్రజా రవాణా ముఖచిత్రాన్ని మార్చే అతిపెద్ద నిర్ణయం. ఎల్ అండ్ టీ నుంచి వాటాల బదిలీకి సంబంధించి ప్రస్తుతం చర్చలు తుది దశలో ఉన్నాయి. ప్రభుత్వం క్లారిటీ ఇస్తే, రాబోయే కొద్ది నెలల్లోనే హైదరాబాద్ మెట్రో పూర్తి స్థాయిలో ప్రభుత్వ సంస్థగా రూపాంతరం చెందనుంది. ఆ తర్వాతే మెట్రో విస్తరణ గురించి అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది

# తగ్గేదేలే అంటున్న బంగారం వెండి ధరలు..

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** వెండి, బంగారం ధరలు మళ్లీ జోరందుకున్నాయి. వెండి ధరల గురించి చెప్పనక్కరలేదు.. తారాస్థాయిలో రేటు పలుకుతోంది. కిలో వెండి ధర ఏకంగా రూ.5 వేలకు పెరిగి ఆల్ టైమ్ రికార్డు రూ.2,31,000 కు చేరింది. వెండి దూకుడు చూస్తుంటే వచ్చే ఏడాది జనవరిలోనే రూ.2,50,000 వేలు పలికినా ఆశ్చర్యపడనక్కరలేదు అంటున్నారు నిపుణులు. అలాగే రానున్న రోజుల్లో బంగారం కొనాలి అంటే సామాన్య మానవుడు కొనే పరిస్థితి నెలకొనలేదు. ఫిబ్రవరిలో పెళ్లిళ్లు ఉండడంతో సామాన్య మానవులు ధరలను చూసి లబోదిబో , వెండి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్సైట్ ప్రకారం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,40,400కు చేరుకుంది. కేవలం గంటల వ్యవధిలోనే బంగారం ధరలు దూకుడు మీదున్నాయి. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ. వేల ధరమేర పెరిగి రూ.1,31,000కు చేరుకుంది. కొన్ని రోజులుగా అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న వెండి ధర గురువారం కూడా అదే ట్రెండ్ను కొనసాగిస్తోంది. ఏకంగా రూ. 5 వేల మేర పెరిగి రూ.2,19,000కు చేరుకుంది. అంతర్జాతీయంగా కూడా పసిడి, వెండి ధరలు చుక్కలను అంటాయి. 24 క్యారెట్ల ఔన్స్ స్పాట్ గోల్డ్ ధర 4,383 డాలర్లను తాకింది. అక్టోబర్లో నమోదైన జీవితకాల గరిష్ఠం కంటే 1.5 శాతం మేర పెరిగింది. ఔన్స్ వెండి ధర కూడా 3.4 శాతం మేర పెరిగి 70 డాలర్లకు చేరువైంది. ఫెడ్ రేట్లో కోతపై పెరిగిన అంచనాలతో బంగారం, వెండి ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయని నిపుణులు చెబుతున్నారు. . ఇదే డిసెంబర్ 24వ తేదీన వెండి కిలో ధర రూ.2,10,000ఉండటం గమనార్హం. పసిడి కూడా ఏమాత్రం తగ్గకుండా పరుగు లంకించుకుంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,100 పెరిగి రూ.1,40,400కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1000 పెరిగి రూ.1,30,000లకు చేరింది. పసిడి ధరలు కూడా మరింత పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బంగారం ధర ఇలాగే ఉంటే సామాన్యులు మాత్రం బంగారం దిక్కు చూడకుండా రోల్డ్ గోల్డ్ వేసుకునే పరిస్థితి నెలకొంది అని సామాన్యులు తెలుపుతున్నారు. రానున్న ఫిబ్రవరి పెళ్లిళ్ల సీజన్లో బంగారం ధర ఎంతవరకు పరుగెడుతుందో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.



# సోషల్ మీడియా వారియర్స్ ఆర్తనాదాలు

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** వైసీపీ కార్యకర్తలు సాయం కోసం అల్లాడిపోతున్నారు. వైసీపీ కోసం విదేశాల్లోఉన్నా కెరీర్ ను నిర్లక్ష్యం చేసి మరీ పార్టీ కోసం పని చేస్తూ బ్రెయిన్ స్ట్రోక్ కు గురైతే కనీసం పార్టీ నుంచి పట్టించుకునేవారు లేకపోవడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవలి కాలంలో ఇలాంటి వారు పెరిగిపోతున్నారు. కానీ పార్టీ నుంచి మాత్రం సాయం అందకపోవడంతో వారిని ఆందోళనకు గురి చేస్తోంది.చదువు కోసమో.. ఉద్యోగం కోసమో అమెరికాకు వెళ్లిన కృష్ణారెడ్డి అనే వైసీపీ కార్యకర్త.. అక్కడి నుంచి సోషల్ మీడియా వారియర్ గా పని చేస్తూంటారు.

కూటమి నేతలను ట్రోల్ చేయడం, అసభ్యంగా పోస్టులుపెట్టడం వంటివి వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు కామన్ కాబట్టి విదేశాల్లో ఉన్నా అవన్నీ చేస్తూంటాడు. అయితే హఠాత్తుగా అతను బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు.

ఆయన ఆరోగ్యం ప్రస్తుతం విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు.డల్లాస్‌లో జరిగిన వైఎస్ జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణ రాజు కృష్ణారెడ్డికి వైద్య సాయం కోసం వెయ్యి డాలర్లు ఇచ్చారు. ఆయన వ్యక్తిగతంగా సాయం చేశారు. కృష్ణారెడ్డి వైద్య ఖర్చుల భారం భారీగా ఉండటంతో, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు 'ఉనీఈబీనిటఓవ' ద్వారా విరాళాలు సేకరిస్తున్నారు. రెండున్నర లక్షల డాలర్లు సాయంకావాలని కోరుతున్నారు. కొంత మంది స్పందిస్తున్నారు. కానీ పార్టీ పరమైన సాయం ఇంకా ప్రకటన రాలేదు.

సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పార్టీ కోసం పనిచేసిన కృష్ణారెడ్డికి సహాయం చేయాలని ఆయన కుటుంబసభ్యులు ఎన్ఆర్ఐ వైసీపీ శ్రేణులు, అభిమానులను కోరుతున్నారు.అమెరికాలోనే కాదు.. ఏపీలోనూ వైసీపీ కార్యకర్తలు ఇలాంటి కష్టాల్లో పడితే పట్టించుకునేవారు లేకుండా పోయింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు శ్యామ్ కలకడ అనే సోషల్ మీడియా వారియర్ ను అలాగే వదిలేయడంతో ఆయన చనిపోయారు. ఇప్పుడు విపక్షంలో ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. చివరికి ఎవరికి వారు లోకేష్ సాయం కోరుతూ ట్వీట్లు పెట్టి కొంత మంది సాయం పొంది ప్రాణాలు కాపాడుకున్నారు. కానీ వైసీపీ నుంచి మాత్రం ఎలాంటి మద్దతూ లభించడం లేదు. ఇది వారి క్యాడర్ ను బాధిస్తోంది.

## ఎడ్యుసిటీకి 1000 కోట్ల

# భూమి విరాళం

**విజయనగరం,తెలంగాణ దిశ :** విశాఖపట్నం – విజయనగరం సరిహద్దుల్లో ఏవియేషన్ ఎడ్యు సిటీ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీనికి సంబంధించి ఇటీవలే ఒప్పందం కుదిరింది. జీఎంఆర్ గ్రూప్ – మాన్సాస్ ట్రస్టు ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు కోసం మాన్సాస్ ట్రస్టు తరుపున రూ.1000 కోట్లు విలువైన 136.63 ఎకరాల భూమిని దానంగా ఇచ్చేందుకు పూసపాటి వంశీయులు అంగీకరించారు. ఈ ప్రాజెక్టుకు తమ వంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పేట్టాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరుతున్నారు.పూసపాటి వంశీయులు మరోసారి తమ పెద్ద మనసు చాటుకున్నారు. భావితరాల భవిష్యత్ కోసం సుమారు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు. విశాఖపట్నం – విజయనగరం సరిహద్దుల్లోఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీనిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. జీఎంఆర్ గ్రూప్. మాన్సాస్ ట్రస్టు ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. ఇటీవలే మంత్రి నారా లోకేష్ సమక్షంలో జీఎంఆర్ – మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం 160 ఎకరాల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ ఏవియేషన్ ఎడ్యు సిటీ కోసం పూసపాటి వంశీయులు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు.ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్టు కోసం 136.63 ఎకరాలు భూమిని అందించేందుకు మాన్సాస్ ట్రస్టు ముందుకు వచ్చింది. విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం వద్ద ఉన్న ఈ భూమిని ఏవియేషన్ ప్రాజెక్టుకు ఇచ్చేందుకు పూసపాటి వంశీయురాలు, అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో జీఎంఆర్ – మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు పూసపాటి రాజవంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పెట్టాలని అదితి గజపతిరాజు కోరారుమరోవైపు విజయనగరం జిల్లా భోగాపురం వద్దఅల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. 2026 మే లేదా ఆగస్ట్ నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలు ప్రారంభించేందుకు విమానయాన శాఖ చర్యలు చేపడుతోంది. అయితే విమానయాన

రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా.. భోగాపురం సమీపంలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీని ఏర్పాటుచేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఏవియేషన్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల బ్రాంచ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయించాలని లక్ష్యంయా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రైతుల వద్ద నుంచి సేకరించిన భూమి లేదా ప్రభుత్వ భూములలో ఈ ఎడ్యు సిటీని ఏర్పాటు చేయాలని తొలుత నిర్ణయం తీసుకుంది.

## పచ్చి ఉల్లిపాయలను రోజూ ఆహారంలో భాగంగా తింటే..

# కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!



భారతీయుల వంటగదుల్లో సర్వసాధారణంగా కనిపించే వాటిల్లో ఉల్లిపాయ కూడా ఒకటి. ఇది దాదాపు అందరి వంటగదుల్లో ఉంటుందని చెప్పవచ్చు. వంటల్లో దీనిని విరివిగా ఉపయోగిస్తూ ఉంటారు. పకోడి, సలాడ్స్, సాండ్‌విచ్ వంటి వాటిల్లో కూడా ఉల్లిపాయను ఎక్కువగా వాడుతూ ఉంటారు. అలాగే చాలా మంది దీనిని భోజనంతో పాటు వివిధ రకాల చిరుతిండ్లతో నేరుగా తీసుకుంటారు. ముఖ్యంగా వేసవి కాలంలో పచ్చి ఉల్లిపాయలను నేరుగా తీసుకుంటూ ఉంటారు. ఇలా చేయడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది. భోజనంతో పాటు పచ్చి ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల రుచిగా ఉండడంతో పాటు మన ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. పచ్చిఉల్లిపాయలల్లో ఉండే పోషకాలు, వీటిని తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

**బీపీ తగ్గేందుకు..:** ఉల్లిపాయలో క్వెర్సెటిన్ ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరంలో వాపులను, అలర్జీ లక్షణాలను కూడా ఇది తగ్గిస్తుంది. ఇవి యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. భోజనంతో పాటు పచ్చి ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు అధిక రక్తపోటు కూడా అదుపులో ఉంటుంది. ఉల్లిపాయల విటమిన్ సి, బి విటమిన్లు, పొటాషియం వంటి పోషకాలు కూడా ఉంటాయి. అధిక రక్తపోటుతో బాధపడే వారు ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలు కూడా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇక చక్కెర వ్యాధితో బాధపడే వారికి కూడా ఉల్లిపాయలు ప్రయోజనకరంగా ఉంటాయి.

# గొల్లపూడిలో శాటిలైట్ రైల్వేస్టేషన్..

**విజయవాడ,తెలంగాణ దిశ :** గొల్లపూడిలో కొత్త శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రిని కోరారు. దీనివల్ల విజయవాడ స్టేషన్‌పై భారం తగ్గుతుందని, అమరావతి కనెక్టివిటీ పెరుగుతుందని తెలిపారు. అలాగే, కొండపల్లి రైల్వే స్టేషన్ వద్ద నీటి సమస్యను పరిష్కరించి, రైళ్ల రాకపోకలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై రైల్వే మంత్రి నిర్ణయం కీలకం కానుంది.ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా శాటిలైట్ రైల్వే స్టేషన్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. గొల్లపూడి సమీపంలో శాటిలైట్ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు.. వినతిపత్రం సమర్పించారు. గొల్లపూడిలో శాటిలైట్/హాల్ట్ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తే విజయవాడ రైల్వేస్టేషన్ పై భారం తగ్గుతుం దని ఎంపీలు వివరించారు. ఈ శాటిలైట్ స్టేషన్ ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం బల్బ్‌లైన్స్ చుట్టూ ఖాళీ స్థలాలున్నాయని, వాటిని రైల్వే అవసరాలకు సులభంగా సేకరించవచ్చని రైల్వేమంత్రికి వివరించారు. ఈ ప్రాంతం కొత్త రైలు, వాయుమార్గాలతో అనుసంధా నం కానుందని.. అమరావతి రైల్వేలైన్ నిర్మాణం కూడా జరుగుతోంద న్నారు. ఈ ప్రాంతం విజయవాడ నగరానికి అన్ని సౌకర్యాలకు సెంటర్‌గా ఉంది కాబట్టి, గొల్లపూడిలో హాల్ట్/శాటిలైట్ స్టేషన్ నిర్మించా లన్నారు.అలాగే అంతేకాదు కొండపల్లి రైల్వేస్టేషన్ దగ్గర నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి కృష్ణా మిల్క్ యూనియన్ వరకు రైల్వే ట్రాక్‌పై నీరు చేరకుండా నీటి నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ఎంపీలు కోరారు. ఈ రెండు సమస్యల పరిష్కారం వల్ల ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. కొండపల్లి రైల్వేస్టేషన్ నుండి విజయవాడలోని కృష్ణా మిల్క్ యూనియన్ వరకు ఉన్న రైల్వే ట్రాక్‌పై మురుగునీరు, వర్షపునీరు నిలిచిపోవడం వల్ల రైళ్ల రాకపోకలకు భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని వారు వివరించారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఇక్కడ నీరు నిలిచిపోతోందని, దీనివల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రమంత్రికి తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడానికి, ట్రాక్ పక్కన డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు నిర్మించి వర్షపునీరు సులభంగా వెళ్లిపోయేలా చూడాలని వారు కోరారు. ఇందుకోసం వెంటనే నిధులు కేటాయించి, పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యల వల్ల రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ప్రయాణికుల భద్రత కూడా మెరుగుపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. మరి ఎంపీల ప్రతిపాదనలపై రైల్వే మంత్రి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.'కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి విజయవాడలోని కృష్ణ మిల్క్ యూనియన్ వరకు ఉన్న రైల్వే ట్రాక్ వెంట మురుగునీరు, వర్షపు నీరు నిల్వ అవుతున్న సమస్యలను కూడా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవి గారికి వివరించాను. వర్షాకాలంలోనే కాకుండా సాధారణ వర్షపాతం సమయంలో కూడా శాస్త్రీయంగా రూపొందించిన డ్రైనేజ్ నెట్వర్క్, క్రాస్ డ్రైనేజ్ నిర్మాణాలు, కాలువల అనుసంధానం లేకపోవడం వల్ల ట్రాక్ వెంట మురుగు నీరు నిల్వవుంటుందని తెలియజేశాను.. ఈ నీటి నిల్వల వల్ల స్థానిక నివాసితులు, పరిశ్రమలు ముఖ్యంగా కృష్ణ మిల్క్ యూనియన్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపాను. ఈ ప్రతిపాదనకు అమల్లోకి వస్తే విజయవాడ నగరంలో రైల్వే రవాణా మరింత సవ్యంగా మారడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, రైల్వే భద్రత, పరిశ్రమలు, స్థానిక ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఆశభావం వ్యక్తం చేశాను.. ఈ ప్రతిపాదనలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గారు సానుకూలంగా స్పందించారు' అంటూ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

# ఆ రెండు పార్టీలు.. కమలంపై కయ్యానికి దిగుతాయా?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ , వైసీపీ అధినేత జగన్ ఇటీవల కొన్ని ప్రత్యేకమైన సిగ్నల్స్ పంపుతున్నారు. తాము బీజేపీకి వ్యతిరేకంగా భారీ యుద్ధం చేసేందుకు రెడీ అన్నట్లుగా వారు సంకేతాలు ఇస్తున్నారు. జగన్ ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోదీ చేపట్టిన కార్యక్రమాలపై అవినీతి ఆరోపణలు చేస్తూండటం, కేసీఆర్ నేరుగా ప్రెస్‌మీట్‌లో మోడీ వచ్చాకే తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతోందన్నట్లుగా మాట్లడుతూండటంతో ఏదో జరుగుతోం దన్న అభిప్రాయం బలపడుతోంది. వీరిద్దరూ ఇతర కూటముల్లోకి వెళ్లలేరు. కానీ కలసి రాజకీయాలు చేస్తే బలంగా ఉంటామని మాత్రం నమ్ముతున్నారు.దేశ రాజకీయాలంతా ఓ వైపు సాగుతూంటే.. బీఆర్ఎస్, వైసీపై మాత్రం మరో వైపు సాగుతూంటాయి.వారు కాంగ్రెస్ కూటమిలోకి వెళ్లలేరు. బీజేపీ కూటమిలోకి వెళ్లలేరు. కాంగ్రెస్ కూటమిలోకి వెళ్తే ఎక్కడ టార్గెట్ అవుతామో.. ఎక్కడ కేసుల పాలవుతా మోనన్న భయం ఉంటుంది. అదే సమయంలో వీర బీజేపీ కూటమిలో కి వెళ్లలేరు. ఇద్దరికీ ఓటు బ్యాంక్ సమస్య ఉంటుంది. జగన్ బీజేపీతో పొత్తులు పెట్టుకుంటే ఆయన పార్టీ నిర్వీర్యం అయిపోతుంది. కేసీఆర్ ఇప్పుడు చాలా ఓటు బ్యాంక్ ఆ పార్టీకి కోల్పోయారు కాబట్టి.. పొత్తులు పెట్టుకోవడానికి రెడీనే .కానీ బీజేపీనే ఆసక్తి చూపించడం లేదు. పార్టీని విలీనం చేయడానికి కూడా సిద్ధపడ్డారని సీఎంరమేష్ చెప్పారు. సాధ్యం కాలేదు. అందుకే తాము ఓ కూటమిగా ఉండాలని కేసీఆర్, జగన్ అనుకుంటున్నారు.జగన్ పుట్టినరోజు సందర్భంగా సజ్జల.. జగన్మోహన్ రెడ్డి దేశవ్యాప్తంగా చక్రం తిప్పుతారని జోస్యం చెప్పారు. అందరి లక్ష్యం అదే. కేసీఆర్ కూడా అలాంటి లక్ష్యం కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు.కానీ కలసి రావడం లేదు. గత ఎన్నికల్లో ఏపీ,తెలంగాణ, మహారాష్ట్ర ఇలా కొన్ని రాష్ట్రాలను టార్గెట్ చేసి రాజకీయాలు చేస్తే జీరో ఫలితం వచ్చింది. అటు జగన్ పరిస్థితి అంతే. అంతే వచ్చే ఎన్నికల్లో అయినా ఆ చక్రం తమ చేతికి వస్తుందని అనుకుంటున్నారు. వైసీప బలం తనకు అదనపు బలం అవుతుందని కేసీఆర్ అనుకుంటున్నారు. జగన్ అలా అనుకోకపోయినా.. ఇప్పటికైతే కేసీఆర్ తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు.వచ్చే ఆరు నెలల్లో తమ రాజకీయ వ్యూహాన్ని మార్చుకుని బీజేపీపై వీరు యుద్ధం ప్రకటించబోతున్నారని తాజా పరిణామాలను బట్టి అర్థం అవుతోందని రాజకీయ వర్గాలంటున్నాయి. కానీ ఇప్పుడు మాట్లాడే మాటలన్నీ కేవలం బీజేపీకి తామున్నామని గుర్తు చేయడానికేనని కొంత మంది అంటున్నారు. ప్రస్తుతం బీజేపీ హైకమాండ్ వీరి ఉనికిని పెద్దగా గుర్తించడం లేదు. వీరు కనుక.., బీజేపీపై యుద్ధం ప్రకటిస్తే.. రాజకీయాల్లో కాస్త మార్పు వస్తుంది.

# బాలినేనికి కలిసి రాని కాలం



**ఒంగోలు,తెలంగాణ దిశ :**బాలినేని శ్రీనివాస్ రెడ్డి. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని పేరు. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా.. సీనియర్ పొలిటీషియన్‌గా పేరున్న బాలినేని ఒంగోలులో మంచి పట్టున్న నేత. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు.. ఆ పార్టీలో అసంతృప్తిగానే కొనసాగారు బాలినేని.గత ఎన్నికల తర్వాత..జనసేన గూటికి చేరారు. వైసీపీలో మంత్రిగా పనిచేసినా..తనకు సరైన గుర్తింపు ఇవ్వలేదని.. రెండున్నరేళ్లు మాత్రమే మంత్రి ఇచ్చారని అసంతృప్తి వ్యక్తం చేస్తూ చాలాసార్లు అలకపాన్పు ఎక్కారు. ఎన్నికలకు ముందే జనసేనలో చేరాలని అనుకున్నా సమీకరణాలు సెట్ అవ్వకపోవడంతో వెయిట్ చేశారు.ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి అధికారంలోకి వచ్చాక పవన్ కల్యాణ్ నేరుగా బాలినేనిని పార్టీలోకి తీసుకున్నారు. ఆయన కూడా ఉత్సాహంగా జనసేనలో చేరారు. బాలినేని జనసేనలో చేరి ఏడాది దాటినా ఇప్పటికీ పార్టీలో సెట్ అయిపోలేదట. పార్టీ నుంచి వెళ్లిపోయినందుకు అటు వైసీపీ నేతలు అప్పుడప్పుడు ఆయనపై దుమ్మెత్తిపోస్తున్నారు.ఇటు కూటమి పార్టీల లీడర్లు కూడా.. బాలినేని వైసీపీ కోవర్ట్ అంటూ టార్గెట్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒంగోలు జిల్లాలో బాలినేనికి పరిస్థితులు అనుకూలంగా కనిపించడం లేదట. అక్కడున్న లోకల్ టీడీపీ లీడర్లు బాలినేనికి వ్యతిరేక గళం వినిపిస్తూనే ఉన్నారు. ఇక జనసేన మెల్లిగా బాలినేనిని ఓన్ చేసుకుంటున్నా అప్పుడప్పుడు కొన్ని సమస్యలు, ప్రోటోకాల్ ఇష్యూస్ వస్తున్నాయ్. ఇవన్నీ గమనించిన పవన్ కల్యాణ్ బాలినేనిపై సాఫ్ట్ కార్నర్ చూపిస్తున్నారట. బాలినేనికి రెండు వైపులా ఇబ్బందులు ఉన్నాయని పవన్ ఓపెన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. పైగా అన్నీ తట్టుకుని నిలబడుతున్నారంటూ బాలినేనిని అభినందించారు పవన్. దీంతో అధినేత మనసులో చోటు సంపాదించుకున్న బాలినేనికి త్వరలోనే ఏదో ఒక పదవి ఖాయమంటూ ప్రచారం జరుగుతోంది.బాలినేనిని పార్టీలోకి తీసుకున్నప్పుడే ఆయనకు ఎమ్మెల్సీ పోస్ట్ ఇవ్వాలనుకున్నారట పవన్. ఆ టైమ్‌లో ఈక్వేషన్స్ కుదరలేదంటున్నారు. నాగబాబును మండలికి పంపడంతో జనసేనకు అవకాశం లేకుండా పోయిందట. ఆ తర్వాత వైసీపీ ఎమ్మెల్సీగా రాజీనామా చేసి జనసేనలో చేరిన జయమంగళ వెంకటరమణ స్థానాన్ని బాలినేనికి ఇవ్వాలని డిసైడ్ అయ్యారట.ఆ బెర్త్ విషయంలో కూడా చిక్కు వచ్చి పడింది. జయమంగళ వెంకటరమణ రాజీనామాను మండలి ఛైర్మన్ ఆమోదించకుండా చాలా కాలంగా పెండింగ్‌లో పెట్టారు. ఈ అంశం ఇప్పుడు కోర్టు పరిధిలోకి వెళ్లింది. జయమంగళ రిసిగ్నేషన్ యాక్సెప్ట్ అయితే ఎమ్మెల్సీ స్థానం బాలినేనికి ఇవ్వడానికి రెడీగా ఉన్నారట పవన్.అయితే మండలి ఛైర్మన్ ఎప్పుడు డెసిషన్ తీసుకుంటారోనని బాలినేని ఎదురుచూడక తప్పట్లేదు. దీంతో మొత్తానికి బాలినేనికి టైమ్ బాలేదన్న చర్చ జరుగుతోంది. అధికార పార్టీలో ఉన్నానన్న ఫీల్ లేకుండా పోయిందంటున్నారు. వైసీపీలో ఎలా అయితే ఇబ్బంది పడ్డారో జనసేనలో కూడా అంతకు మించి ఇబ్బందులు పడుతున్నారట బాలినేని. అయితే జనసేన అధినేత పవన్ సాఫ్ట్ కార్నర్‌తో ఉండటం బాలినేనికి కలిసొచ్చే అంశమంటున్నారు. బాలినేనికి కోరుకున్న పదవి దక్కేదెప్పుడో చూడాలి మరి.

# సర్ తో అంతా సరౌతుందా?


**హైదరాబాద్,తెలంగాణ దిశ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. మరోవైపు మేధావి వర్గం సైతం అభ్యంతరాలు చెబుతోంది. ఈ సవరణలో భాగంగా చాలా రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. దీంతో ఇది దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎన్నికల సంఘం తాజాగా తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాల ప్రకారం తమిళనాడులోని 97.37 లక్షల ఓట్లను తొలగించినట్లు ఈసీ అధికారికంగా ప్రకటించింది. గుజరాత్ లోను 73 లక్షల ఓట్లను జాబితా నుంచి తొలగించారు. తొలుత బీహార్లో ఈ ప్రక్రియ చేపట్టి ఎన్నికలు నిర్వహించారు. అక్కడ ఎన్డీఏ ఘనవిజయం సాధించడంతో ప్రత్యేక సమగ్ర సవరణ అనేది రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నది అనే వాదన బలపడింది. ప్రజాస్వామ్యం పారదర్శకంగా ఉండాలన్న ఆలోచనతోనే ఈ ప్రక్రియ చేపట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోంది. బీహార్లో ప్రత్యేక ఏజెన్సీ ద్వారా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే ఈ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పుకోస్తోంది ఈసీ. వాస్తవానికి ప్రతి రాష్ట్రంలోనూ మరణించిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. వలస వెళ్లిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. ఒక్కొక్కరికి రెండు చోట్ల కూడా ఓట్లు ఉంటున్నాయి. ఈ విషయంలో ప్రత్యేక సమగ్ర సవరణ మంచిదే. కానీ ప్రజలతో పాటు మేధావుల సందేహాలను నివృత్తి చేయడంలో మాత్రం ఎలక్షన్ కమిషన్ అనుకున్న స్థాయిలో శ్రద్ధ చూపడం లేదు. అందుకే రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం ఈ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని స్పష్టం చేస్తోంది. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అనంతరం అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పిస్తున్నామని.. అర్హులైన వాటర్లు తమ పేరును తొలగించబడితే సంబంధిత బూత్ లెవెల్ అధికారులను కానీ.. ఈసీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తుంది. తుది జాబితా విడుదలకు ముందు అన్ని అభ్యంతరాలను పరిశీలిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే బీహార్లో తమ ఓట్లు గల్లంతయ్యాయని.. చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తమ ఓట్లను దూరం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్నికల కమిషన్ అభ్యంతరాలు ఉంటే చెప్పాలని చెబుతోంది. తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని సూచిస్తుంది. అయితే ఇప్పటివరకు తమ సొంత ప్రాంతంలో ఓటు వేసేవారు.. తాము నిజంగా ఓటర్లమని ధ్రువీకరించుకోవాల్సి వస్తోంది. దీనిపైనే ఎక్కువగా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. చనిపోయారని చెప్పి చాలా మంది ఓట్లను తొలగించారు. అటువంటి వారు న్యాయస్థానాలను ఆశ్రయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఈ సమగ్ర సవరణ అనేది మంచి కార్యక్రమమే. కానీ సరైన అధ్యయనం చేయకుండా చేస్తే మాత్రం ఇబ్బందికరమే. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ఓటు అనేది ఆయుధం. అటువంటి ఓట్లను సవరించే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. బీహార్లో అధ్యయనం చేసిన తరువాత మాత్రమే మిగతా రాష్ట్రాల్లో చేస్తున్నామని ఎలక్షన్ కమిషన్ చెబుతోంది. కానీ ఈ అధ్యయనం ఎవరు చేశారు? ఏ సంస్థ చేసింది? ఏమని నివేదిక ఇచ్చింది? అనే విషయాలను మాత్రం ఎలక్షన్ కమిషన్ బయట పెట్టడం లేదు. అందుకే ఇప్పుడు అందరిలోనూ అదే అనుమానం. దేశవ్యాప్తంగా సమాజం పట్ల అవగాహన ఉన్న పౌరులతో పాటు తటస్థులు, మేధావులు ఇదే విషయంపై ప్రశ్నిస్తున్నారు. కానీ ఎన్నికల కమిషన్ నుంచి ఆశించిన స్థాయిలో జవాబు రావడం లేదు.ఇప్పటికే ఎన్ డి ఏ పై ఒక అపవాదు ఉంది. ఈవీఎంల టెంపరింగ్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. దానిపై ఒక వైపు గలాటా నడుస్తుంటే.. కొత్తగా సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల కమిషన్ ఎంత జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. రాజ్యాంగబద్ధమైన ఓ స్వతంత్ర సంస్థగా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎన్నికల కమిషన్ పై ఉంది. దానినే గుర్తు చేస్తున్నారు మేధావులు. ఆపై పౌర సమాజం. ఇక తేల్చుకోవాల్సింది ఎన్నికల కమిషన్ మాత్రమే.

# వేతనం ఆధారంగా హెచ్1-బీ

## 2026లో కొత్త నిబంధనలతో వీసాల జారీకి కసరత్తు

### 'లాటరీ' విధానంలో మార్పులపై తుది సమీక్ష చేస్తున్న అమెరికా




వాషింగ్టన్: విదేశీ వృత్తి నిపుణులకు ఇస్తున్న 'హెచ్1-బీ' వీసా ఎంపిక ప్రక్రియలో సమూల మార్పులు ప్రతిపాదిస్తూ ట్రంప్ సర్కార్ చేపట్టిన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. సరికొత్త వీసా విధానంపై 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ' ప్రతిపాదనలు రూపొందించగా, వాటిపై (హెచ్1-బీ లాటరీ సిస్టం) తుది సమీక్ష మొదలైంది. నైపుణ్యం, వేతనాల ఆధారిత లాటరీ వ్యవస్థ కోసం రూపొందించిన నిబంధనలను 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' సమీక్షిస్తున్నది. ఫెడరల్ నిబంధనల మార్పులపై సమీక్షను చివరి దశగా పరిగణిస్తారు. ఇక్కడ ఆమోదం పొందిన తర్వాత నిబంధనలు ఖరారు చేసి వాటిని ప్రకటిస్తారు. సమీక్షను పూర్తి చేసి తుది నిబంధనలకు సంబంధించి అడ్వాన్స్ కాపీని త్వరలోనే విడుదల చేయనున్నట్టు సమాచారం. వచ్చే ఏడాది నుంచే హెచ్-1బీ వీసాల జారీకి ఈ కొత్త నిబంధనలను అమలు చేయాలని అమెరికా సర్కార్ భావిస్తున్నది. అమెరికన్లకు ప్రాధాన్యం!: అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించేలా అగ్రరాజ్యం కొత్త మార్పులు తీసుకురానున్నది. ప్రస్తుతం హెచ్-1బీ వీసాల జారీకి కంప్యూటరైజ్డ్ లాటరీ విధానాన్ని అనుసరిస్తుండగా, ఇకపై 'వెయిటెడ్ సెలెక్షన్ సిస్టమ్'ను ప్రవేశ పెట్టనున్నారు. దీని ప్రకారం ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించటం, వేతన వర్గీకరణ ఆధారంగా దరఖాస్తులను విభజించటం వంటివి చేయనున్నారు. అంటే ఇకపై అధిక వేతనం కలిగిన ఉద్యోగులకు హెచ్-1బీ వీసా లు ఎక్కువగా దక్కే అవకాశం ఉంటుంది. పీఈఆర్ఎం ద్వారా గ్రీన్‌కార్డుకు దరఖాస్తులు: పీఈఆర్ఎం ప్రోగ్రామ్ ద్వారా యూఎస్ గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియను పునః ప్రారంభిస్తున్నట్టు గూగుల్ ప్రకటించింది. 2023లో భారీ తొలగింపుల మధ్య ఆగిపోయిన ఈ ప్రక్రియను పునః ప్రారంభించాలని కంపెనీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు బిజినెస్ ఇన్‌సైడర్ వార్తా కథనం తెలిపింది. టెక్ ఉద్యోగుల వీసాలపై ప్రస్తుతం పూర్తి అనిశ్చితి నెలకొన్న క్రమంలో కంపెనీ తన ఇమిగ్రేషన్ పాలసీలో మార్పు చేస్తున్నామన్న విషయాన్ని ఉద్యోగులతో పంచుకుంది. పీఈఆర్ఎం అంటే ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్. ఇది అమెరికా ప్రభుత్వ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్. ఒక విధంగా చెప్పాలంటే అమెరికాలోని ఏదైనా కంపెనీ విదేశీ ఉద్యోగులను శాశ్వతంగా నియమించుకోవాలంటే అది అమెరికా ప్రభుత్వం నుంచి పీఈఆర్ఎం లేబర్ సర్టిఫికేషన్ పొందాలి.
ఆ ఉద్యోగానికి అర్హులైన అమెరికా పౌరులు, గ్రీన్‌కార్డు దారులు లేరని నిరూపించడం, విదేశీ ఉద్యోగులను నియమించడం ద్వారా అమెరికా పౌరులకు నష్టం కలగదని నిర్ధారించడం ఈ సర్టిఫికేషన్ ముఖ్య ఉద్దేశం. గత మూడేండ్లుగా ఈ విధానాన్ని
నిలిపివేసిన గూగుల్ ట్రంప్ కఠిన వీసా నిబంధనల కారణంగా పునరుద్ధరించాలని నిర్ణయించింది. 2023లో 12వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికిన క్రమంలో ఆ ఏడాది జనవరి నుంచి పీఈఆర్ఎం దరఖాస్తులను కూడా గూగుల్ నిలిపివేసింది. ఆ సమయంలో అమెజాన్, మెటా లాంటి దిగ్గజ టెక్ కంపెనీలు కూడా ఆ కార్యక్రమాన్ని నిలిపివేశాయి. ప్రస్తుతం పీఈఆర్ఎం-2026కు దరఖాస్తు చేసుకునే ఉద్యోగులకు కఠినమైన అర్హతా ప్రమాణాలను కంపెనీ నిర్దేశించినట్టు తెలిసింది.

## మైలార్‌దేవ్‌పల్లిలో ఆపరేషన్ చబుత్ర..

### అర్ధరాత్రి రోడ్లపై తిరిగేవారికి పోలీసుల వార్నింగ్




హైదరాబాద్,తెలంగాణ దిశ: రాత్రిపూట పెరుగుతున్న నేరాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేం దుకు హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్రను చేపట్టారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ, వీధుల్లో కూర్చొని ముచ్చట్లు పెడుతున్న వారికి వార్నింగ్ ఇచ్చారు. నిబంధనలు పాటించకుండా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా తెరిచి ఉన్న హోటళ్లు, పాన్‌షాపులను మూసివేయించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ చబుత్ర నిర్వహించినట్లుగా ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు.

### జగన్‌కు జ్వరం..కార్యక్రమాలు రద్దు

**పులివెందుల,తెలంగాణ దిశ :**వైసిపి అధినేత వైఎస్.జగన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో బాధపడుతున్న కారణంగా డాక్టర్ల సూచన మేరకు కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఈ మేరకు వైసిపి ఎక్స్ వేదికగా ఈ ప్రకటనను విడుదల చేసింది. పులివెందుల పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ ఇడుపులపాయలో ప్రార్థనల్లో పాల్గొనాల్సి ఉంది. అలాగే, మధ్యాహ్నం పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా, అనారోగ్యం కారణంగా ఈ కార్యక్రమాలు రద్దయ్యాయి. సందర్భంగా పులివెందుల సీఎస్ఐ చర్చి క్రిస్టమస్ వేడుకల్లో వైఎస్ జగన్ పాల్గొనే అవకాశం ఉంది.


# సీమలో సైలెంట్ వేవ్..

కర్నూలు,,తెలంగాణ దిశ : రాయలసీమలో వైసీపీ క్రమంగా పుంజుకునట్లు కనిపిస్తుంది. కూటమి పార్టీ నేతల్లో విభేదాలతో పాటు వైసీపీ పట్ల సానుకూలత ఒకరకంగా వైసీపీకి వచ్చే ఎన్నికల్లో కలసి వచ్చే అంశంగా కనిపిస్తుంది. రాయలసీమలో మొత్తం యాభై రెండు శాసనసభ నియోజకవర్గాలున్నాయి. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతో పాటు పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పాటు రాజధాని అమరావతికే తెచ్చిన రుణాలన్నీ పెడుతున్నారన్న ప్రచారం కూడా కూటమి పార్టీలకు ఇబ్బందికరంగా మారిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో ఒక ఊపు ఊపిన కూటమి ఈసారి మాత్రం కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయని ఖచ్చితంగా చెప్పాలి. అందులోనూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావం కూడా కూటమి పై ప్రతికూలత చూపుతుందని అంటున్నారు.గత ఎన్నికల్లో కర్నూలులో పద్నాలుగు స్థానాలుంటే రెండు స్థానాల్లో మాత్రమే వైసీపీ గెలిచింది. అది కూడా ఆలూరు, మంత్రాలయంలో మాత్రమే ఫ్యాన్ పార్టీ గలిచింది. ఆదోనిలో బీజేపీ, మిగిలిన పదకొండు నియోజకవర్గాల్లో టీడీపీ విజయం సాధించింది. అనంతపురం జిల్లాలో పద్నాలుగు నియోజకవర్గాలుంటే కూటమి గత ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. ధర్మవరంలో మాత్రం బీజేపీ గెలిచింది. మిగిలిన పదమూడు చోట్ల టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. కడపలో పది నియోజకవర్గాలుంటే అందులో మూడింటిలో వైసీపీ మిగిలిన చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ గెలుచుకున్నాయి. వైసీపీ బద్వేలు, కడప, మైదుకూరుల్లో మాత్రమే గెలిచింది. ఇక చిత్తూరు జిల్లాలో పద్నాలుగు నియోజకవర్గాలుంటే రెండింటిలో మాత్రమే వైసీపీ గెలిచింది. తంబళ్లపల్లి, పుంగనూరులో వైసీపీ గెలుపొందగా తిరుపతిలో జనసేన గెలిచింది. ఇప్పటికే కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పరిస్థితులు మారాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇక్కడ కూటమి నేతలు యాక్టివ్ గా లేకపోవడంతో పాటు వైసీపీ నేతలు క్రమంగా బలం పుంజుకుంటున్నట్లు కనపడుతుంది. ఇక వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వైసీపీ మరింత బలపడే అవకాశాలున్నాయని అంటున్నారు. వేవ్ ఇప్పుడు సీమ జిల్లాల్లో మారిందన్నది నిఘా వర్గాలు కూడా ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం. ప్రజల్లో అధికార పార్టీపై ఎప్పుడూ అసంతృప్తి ఉంటుంది. అది ప్రతిపక్ష పార్టీకి కొంత అనుకూలంగా మారుతుంది. మరొకవైపు జగన్ ను సీమ ప్రాంత వాసిగా చూడటంతో మరికొంత ప్లస్ అయిందని అంటున్నారు.మరి చివర వరకూ ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం రాయలసీమలో కూటమికి కష్టాలు.. వైసీపీకి వేవ్ మామూలుగా ఉండవన్న విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

# మూడేళ్ల ముందు నుంచే టిక్కెట్ల లొల్లి

**మహబూబ్ నగర్,తెలంగాణ దిశ :**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు పీక్ లెవల్‌కు చేరాయి. కారు పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో క్యాడర్ రెండుగా చీలిపోయిం దన్న టాక్ వినిపిస్తోంది. షాద్ నగర్ నియోజకవర్గంలో 2014, 2018లో రెండు సార్లు ఘన విజయం సాధించిన గులాబీ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైంది.
గత రెండేళ్లుగా పార్టీ వర్గ విభేదాలతో కొట్టుమిట్టాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఏ మాత్రం పొసగడం లేదు. అంజయ్య యాదవ్, నవీన్ రెండు వర్గాలుగా విడిపోవడంతో ద్వితీయస్థాయి నేతలతో పాటు కార్యకర్తలు అయోమయంలో పడ్డారట. అధికార పార్టీ మీద పోరాడాల్సింది పోయి..సొంత పార్టీలో ఈ కుంపటి ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట గులాబీ పార్టీ కార్యకర్తలుమాజీ ఎమ్మెల్యే అంజయ యాదవ్ ఈ సారి తన కుమారుడికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ట్రై చేస్తున్నారట.
నవీన్ రెడ్డి ఎమ్మెల్యే సీటుపై కన్నేయ దంతో తమ సీటుకు ఎసరు వస్తుందన్న ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నవీన్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలవడంతో ఆయనపై బీఆర్ఎస్ అధిష్టానానికి మంచి అభిప్రాయం ఉండటంతో పాటు ఆర్థికంగా రాజకీయంగా అన్ని విధాల నవీన్ కుమార్ బలంగా ఉండటంతో స్పీడు పెంచారు. ఇదే ఇప్పుడు అంజయ్య యాదవ్ వర్గంలో ఆందోళన కు కారణమవుతోందని తెలుస్తోంది.ఎమ్మెల్సీ హోదాలో ఉన్న నవీన్ రెడ్డి..హైదరాబాద్‌లోని పార్టీ ఆఫీస్ మొదలుకొని షాద్‌నగర్ వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ప్రజల దృష్టిలో, అధిష్టానం దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారట. అంతేకాదు బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలకు షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించడంతో..కేటీఆర్ కూడా నవీన్ రెడ్డిని అభినందించారట. ఇది మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌వర్గానికి ఏ మాత్రం రుచించడంలేదంటున్నారు.అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోదన్న టాక్ వినిపిస్తోంది. లేటెస్ట్‌గా జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ ఓ వైపు అంజయ్య యాదవ్, మరోవైపు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఎవరికి వారు సెపరేట్‌గా.. తమ వర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దింపి చాలా వరకు గెలిపించుకున్నారు. అయితే అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి వర్గ పోరు పార్టీకి డ్యామేజ్ చేస్తుందన్న ఆందోళన క్యాడర్ కనిపిస్తోందట. ఇంకా కొన్ని పంచాయితీల్లో గెలవాల్సి ఉన్నా అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి విభేదాలతో అధికార కాంగ్రెస్‌కు మేలు జరిగిందని అంటున్నారు. ఇక షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ మద్దతుదారులుగా బరిలో నిలిచి గెలిచిన సర్పంచ్‌లను తెలంగాణ భవన్‌లో సన్మానించారు కేటీఆర్.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరు కాలేదు. అంతే కాకుండా ఈ సమావేశంలో అంజయ్య యాదవ్ మళ్లీ భారీ మెజార్టీతో గెలుస్తారని కేటీఆర్ చెప్పడంతో మళ్లీ ఆయనకే టికెట్ అని చెప్పకనే చెప్పారన్న చర్చ మొదలైంది. ఇంకా ఎన్నికలకు మూడేళ్ల సమయం ఉండగానే..
మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ టికెట్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. అప్పటి వరకు పరిస్థితు ల్లో మార్పు వచ్చి తనకే టికెట్ వస్తుందన్న ధీమాతో నవీన్ రెడ్డి ఉంటే..అధిష్టానం ఆశీస్సులు తనకే ఉన్నాయని అంజయ్య యాదవ్ చెప్పుకుంటున్నారట.
మొత్తానికి షాద్‌నగర్ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గాల మధ్య కార్యకర్తలు నలిగిపోవాల్సి వస్తుందట. మాజీ ఎమ్మెల్యే వెంట నడవా లో..ఎమ్మెల్సీ చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనాలో తెలియక గులాబీ పార్టీ కార్యకర్తలు సతమతం అవుతున్నారని అంటున్నారు.

# పావు వంతు లెక్చరర్లతో చదువు సాగేదెలా..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల పరిస్థితి దారుణంగా తయారైంది. సరిపడ బోధనా సిబ్బంది లేక సర్కారు కాలేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఉన్నత విద్యను ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాళీ అవుతున్న పోస్టులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేయకపోవడంతో డిగ్రీ కాలేజీల్లో బోధించే అధ్యాపకుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది. రెగ్యులర్ అధ్యాపకులను నియ మించకుండా వారి స్థానంలో గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించుకొని నెట్టుకొస్తున్నారు. కాలేజీల్లో సరి పడా సిబ్బంది లేకపోవడంతో తమ పిల్లలను ఆ కాలేజీల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు పెద్దగా సుముఖత చూపించడంలేదు. డిగ్రీ కాలేజీల్లోని కీలక పోస్టులైన ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 149 డిగ్రీ కాలేజీలుంటే, వీటిలో 4,520 పోస్టులకు పనిచేస్తున్నది మాత్రం కేవలం 1,695 మందే. 2,825 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇందులోనూ 2,570 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఈ 2,570 పోస్టుల్లో 50 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, మరో 50 శాతం జూనియర్ లెక్చరర్లను ప్రమోషన్ల ద్వారా భర్తీచేస్తారు. అంతేకాకుండా 145 ప్రిన్సిపాల్ పోస్టులకు గానూ ప్రస్తుతం పని చేస్తున్నది కేవలం 84 మందే.మిగతా పోస్టులు ఖాళీనే. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 133 ఉంటే కేవలం 23 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 110 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులను ఆటలు ఆడించే పరిస్థితే లేదు. లైబ్రేరియన్ పోస్టులు 133 ఉంటే, ఏకంగా 90 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పనిచేస్తున్నది 43 మంది మాత్రమే. ఇలా ప్రధాన పోస్టుల్లో సిబ్బంది లేక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కునారిల్లుతున్నాయి. ఉన్నవారినే ఇన్‌చార్జిలుగా పెట్టి కళాశాలలను నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. సరిపడ అధ్యాపకులు కాలేజీల్లో లేకపోవడంతో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపడంలేదు. పేరున్న మంచి కాలేజీల్లో సీట్లు నిండితున్నా మిగతా కాలేజీల్లో అయితే నిండడం కష్టంగానే మారింది. ఈ ఏడాది కాలేజీల్లో సీట్లు అంతంత మాత్రంగానే నిండాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో దాదాపు 90 వేల సీట్లుంటే 51 వేల అడ్మిషన్లు మాత్రమే నిండాయి.సిబ్బంది కొరత, సరైన వసతుల్లేకపోవడంతో ఇంటర్ తర్వాత చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లోనే చేరుతున్నారు. ప్రైవేట్ కాలేజీల్లో దాదాపు 1.22 లక్షల మంది చదువుతున్నారు. ప్రైవేట్ వైపు విద్యార్థులు మళ్లకుండా ఉండాలంటే ప్రభుత్వం అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతోపాటు కాలేజీల్లో ల్యాబ్‌లు, ఇతర వసతులను కల్పించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### అనుచరుడి చాయి దుకాణం ప్రారంభించిన మంత్రి..

**మక్తల్,తెలంగాణ దిశ :**నేడు ఉదయం మంత్రి వాకిటి శ్రీహరి అనుచరుని చాయి దుకాణం ప్రారంభించారు. వాకిటి మాట్లాడుతూ.. మంత్రిగా ప్రారంభించింది చిన్నదే అయిన ఒకరికి ఉపాధి కల్పించాలన్న తృప్తి ఉందన్నారు. తనను నమ్ముకుని తన చేతి కింద పని చేసిన వారందరికీ ఉపాధి కల్పించడంలో భాగంగా ఎప్పుడు రద్దుగా ఉండే బస్టాండ్ ఏరియాలో నారాయణ పేట ఆర్టీసీడిఎంతో మాట్లాడి.. బస్టాండ్ ముందు నెలవారి కిరాయి బేస్ మీద టీ కొట్టును సాగించేలా అధికారికంగా ఉత్తర్వులు తీసుకుని టీ కొట్టు ఏర్పాటు చేయడానికి ఆర్థిక సాయం చేశారు. రాజకీయంగా వెనుక తిప్పుకుని అవసరం అయిపోగానే గాలికి వదిలేసే ఈ రోజుల్లో అనుచరులకు ఉపాధి చూపించిన మంత్రి మంచితనాన్ని జనాలు మెచ్చుకుంటున్నారు.

# కలకలం రేపుతున్న ఎఫ్ స్టీన్ ఫైల్స్

న్యూఢిల్లీ, : ప్రపంచవ్యాప్తంగా ఎఫ్ స్టీన్ ఫైల్స్ ఎంతటి సంచలనం సృష్టిస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ వ్యవహారంలో వేలాది ఫోటోలు ఉన్నాయని.. ప్రపంచవ్తంగా పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వ్యక్తులంతా ఇందులో ఉన్నారని అమెరికా మీడియాలో ప్రధానంగా వార్తలు వస్తున్నాయి. దీనికి తోడు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ నుంచి మొదలు పెడితే.. ట్రంప్ వరకు అందరూ ఉండడంతో ఒక్కసారిగా కలకలం నెలకొంది.ఇటీవల అమెరికా మీడియాలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ఫోటోలు దర్శనమిచ్చాయి. అతడితో పాటు కొంతమంది అమ్మాయిలు కూడా ఉన్నారు. కొన్ని ఫోటోలు అత్యంత దారుణంగా ఉన్నాయని.. అవి బయట పెడితే ఆ ప్రముఖుల అసలు గుట్టు బయటపడుతుందని చాలామంది అనుకున్నారు. అయితే ఇందులో కొంతమేర మతలబు చోటుచేసుకుంది. అంతేకాదు ట్రంప్ ఫోటోలు కూడా మాయమయ్యాయి. దీంతో తెరవెనక ఏదో జరిగి ఉంటుందని అందరు అనుకున్నారు. అయితే ఊహించని విధంగా సోమవారం తెల్లవారుజామున కొన్ని ఫోటోలు బయటకు రావడంతో మరోసారి కలకలం ఏర్పడింది.ఎప్ స్టీన్ వ్యవహారానికి సంబంధించిన దాదాపు 16 ఫైల్స్ మాయమైనట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు కొద్దిరోజులుగా వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే వీటిలో న్యాయశాఖ సంబంధించిన వెబ్ పేజీ నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోటో మళ్లీ ప్రత్యక్షమైంది. కొద్ది రోజులు ఈ ఫోటో మిస్ అయినట్టు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి.
ఈ ఫోటోకు సంబంధించి తాత్కాలికంగా రివ్యూ కోసమే తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు చెప్పడం గమనార్హం. అయితే ఆ ఫోటోలో ట్రంప్ తన భార్య మెల్లనియ, ఎప్ స్టీన్, అతడి స్నేహితురాలు గిస్లైన్ మాక్స్ వెల్ కనిపించారు.ట్రంప్ ఫోటో మాయం వెనక అమెరికాను ఆశాక అధికారులు స్పందించారు. ఈ వ్యవహారంలో ఉన్న యువతులకు సంబంధించిన గుర్తింపులు, ఇతర వ్యవహారాలు బయటికి రాకుండా ఉండడానికి చర్యలు తీసుకున్నామని.. దాని సమీక్ష కోసం ట్రంప్ ఫోటో బయటికి రాకుండా తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే ఇదంతా తాత్కాలికంగానే చేశామని.. ఈ కేసులో ఎవరైతే బాధితులుగా ఉన్నారో.. వారిని మాత్రమే తాము రక్షించడానికి దస్త్రాలలో సవరణలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎవరి వైపు తాము పక్షపాతం ప్రదర్శించడం లేదని.. సమరూపకంతోనే వ్యవహరిస్తున్నామని వెల్లడించారు.

# చీరతో పట్టేసే చేప పిల్లలకు భలే డిమాండ్!



**కాకినాడ,తెలంగాణ దిశ :** గోదావరి జిల్లాలో పులసకు ఉన్న క్రేజ్ ఎంతో అందరికీ తెలిసిన విషయమే.. కానీ ఇంచుమించు ఈ సీజన్‌లో అంతే క్రేజ్ ఉన్న గోదావరి వంటకం చీరమేను..చీరతో వేటాడే ఈ చేపపిల్లల టేస్ట్ గురించి మాంస ప్రియులు చాలా గొప్పగా చెబుతారు.. గోదావరిలో లభ్యమయ్యే ఈచీరమేను రేటు కూడా అంతేస్థాయిలో కూడా ఉంటుంది.. ఎందుకంటే ఇది అరుదుగా దొరికే సీజనల్ చీరమేను కావడం దీనికి ప్రధాన కారణం కూడా.. పూర్వ కాలంలో శేరు, తవ్వ, సోల కింద కొలిచి అమ్మే ఈ చీరమేను ఇప్పుడు కిలోల లెక్కన అమ్మకాలు సాగిస్తున్నారు.. ఒక కిలో చీరమేను రూ.3000 నుంచి రూ.4000 వరకు విక్రయాలు జరుగుతుండగా పావుకిలో చొప్పున కూడా అమ్మకాలు చేస్తుంటారు స్థానికంగా ఉన్న మత్స్యకారులు.. తాజాగా చీరమేను సీజన్ కావడంతో పుదుచ్చేరీ యానం మార్కెట్‌లో చీరమేను ను కొనేందుకు ఎగబడుతున్నారు నాన్ విజిటేరియన్స్...గోదావరిలో చీరమేను అరుదుగా దొరుకుతుంది కాబట్టే దీనికి ఇంత ధర పలుకుతుందంటుంటారు చీరమేను గురించి తెలిసిన వారు.. గోదావరి ప్రవాహం ఓ వైపు, గోదావరిపై వీచే శీతల చల్లగాలులు మరోవైపు ఈ ప్రభావానికి దొందు జాతికి చెందిన చేపపిల్లలు సమూహంగా నీటి ఉపరితలంపై నురగలాతేలుతూ కదులుతుంటాయి.. నీటిఅలల తాకిడికి నురగ కూడా తోడవ్వడంతో ఈసమూహాన్ని గుర్తించడం మత్స్యకారులకు చాలా తేలిక అవుతుంది. ఈ సమూహం కదలికను ముగ్గురు కలిసి చీరతో అడ్డుకుని పట్టుకుంటారు.. ఇది గట్టుపైకి తీసుకువచ్చి నీళ్లల్లో కడిగి బకెట్లలోఉంచుతారు.. వలకు చిక్కని చిన్న చేపపిల్లలు కావడం, సమూహంగా కదలడంతో వలకు చిక్కవు గనుక ఈ చేపపిల్లలను చీరతో మాత్రమే పట్టుకునేందుకు వీలవుతుంది.. అందుకే వీటికి చీరమేను అనే పేరు వచ్చిందంటారు.. అయితే ఇప్పుడు సీడ్ నెట్ అందుబాటులో ఉండడంతో వీటితోనే చీరమేనును పట్టుకుంటున్నారు.గోదావరిలో అరుదుగాదొరికే ఈ సీజనల్ చీరమేను కోసంమాంస ప్రియులు ఎందు కు అంతగా ఎగబడతారు అంటే వీటితో చేసిన వంటకాలు అంత రుచిగా ఉంటాయని చెబుతుంటారు.. చీరమేను చింతకాయ పులుసు, చీరమేను మసాలా కూర, చీరమేనుతో కలిపి వేసిన గారెలు అబ్బో ఆ టేస్టే వేరే లెవెల్ అంటుంటారు గోదావరి ప్రజలు.. ప్రస్తుతం చీరమేను యానాం చేపలమార్కెట్‌లో దొరుకుతోంది.. ధవళేశ్వరం, అంతర్వేది, ఓడలరేవు ఇలా చాలా ప్రాంతాల్లో ఈ చీరమేను లభ్యం అవుతోంది.. కొంతమంది కిలోల లెక్కన విక్రయాలు చేస్తుండగా కొంత మంది కొలతల ప్రకారం అంటే శేరు, తవ్వ,సోల ప్రకారం కొలిచి అమ్ముతు న్నారు.

# ఆ లేడీ ఆఫీసర్ వయిలెంట్!

**అనంతపురం,తెలంగాణ దిశ :** సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఆర్డీవో సువర్ణపై మూకుమ్మడిగా కలెక్టర్‌కు కంప్లైంట్ ఇచ్చారు వీఆర్వోలు. ఆధార్ అప్డేట్ విషయంలో వెనకబడ్డారంటూ వీఆర్వోతో గుంజీలు తీయించారంటూ ఫిర్యాదు చేశారు. పుట్టపర్తిఆర్డీవో కార్యాలయంలో ఆధార్ అప్డేషన్‌పై వీఆర్వోలకు ప్రత్యేక శిక్షణ ప్రోగ్రామ్ జరిగింది. ఈ ట్రైనింగ్ సెషన్‌లో ఒడిసి మండలం వీఆర్వోపై మండిపడ్డారు ఆర్డీవో సువర్ణ. ఆధార్ అప్డేట్‌లో బాగా వెనకబడ్డారంటూ ఫైర్ అయ్యారు. ఆర్డీవో సువర్ణ అడిగిన ప్రశ్నలకు వీఆర్వో సమాధానం ఇచ్చాడు. ఆధార్ అప్డేషన్ జరగకపోవడానికి కారణాలను వివరించాడు. చాలామంది బెంగళూరుకు వలస వెళ్లారని.. వాళ్లు వచ్చేంతవరకూ ఆధార్ అప్డేషన్ చేయలేమంటూ ఆర్డీవోకి సమాధానం ఇచ్చాడు వీఆర్వో.. అంతే,ఆర్డీవో సువర్ణకు సర్రున కోపమొచ్చింది. ఎప్పుడూ ఒకే కారణం చెబుతూ తప్పించుకుంటావా అంటూ సువర్ణ మండిపడ్డారు..అంతటితో ఆగకుండా, ఆధార్ అప్డేషన్‌లో వెనకబడినందుకు గుంజీలు తీయాలంటూ ఆర్డీవో సువర్ణ ఆదేశించారు. ఆర్డీవో ఆర్డర్ వేయడంతో చేసేదేమిలేక.. మిగతా వీఆర్వోల ముందే గుంజీలు తీశాడు. దాంతో, అక్కడున్న వీఆర్వోలందరూ ఆర్డీవో సువర్ణపై ఎదురుతిరిగారు. ఏంటీ నియంతృత్వ పోకడ అంటూ ఆమెతో వాగ్వాదానికి దిగారు. గుంజీలు తీయించడం ఆపాలని విజ్ఞప్తిచేశారు.ఎంత విన్నవించుకున్నా, ఎంతమంది చెప్పినా వినకుండా వీఆర్వోతో గుంజీలు తీయించారు ఆర్డీవో. దాంతో, ఈ ఘటనపైజిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు వీఆర్వోలు. తమను అవమానించారంటూ ఆర్డీవో సువర్ణపై కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.మొత్తంఘటనపై విచారణ జరిపి, ఆర్డీవో సువర్ణపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు వీఆర్వోలు..

# పీ4 పథకంతో కుటుంబాల దత్తత

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా థింక్ ట్యాంక్ ను ఏర్పాటు చేసుకుంటారు. వారు అనేక రకాలుగా ఆలోచించి ఇటు ఓటు బ్యాంకు పెరిగి రాజకీయంగా పార్టీ బలోపేతం అవ్వడమే కాకుండా చంద్రబాబు పాలనకు మంచి మార్కులు జనంలో పడేలా అన్ని రకాలుగా ఆలోచించి తగిన పథకాలను రూపొందిస్తారు. థింక్ ట్యాంక్ రూపొందించిన వాటిలో వర్క్ అవుట్ అయ్యేవి మాత్రమే చంద్రబాబు అందిపుచ్చుకుంటారు. అందులో నుంచి ఈ ఏడాది వచ్చిందే పీ4 పథకం. పేదరిక నిర్మూలన కోసం ఈ పథకాన్ని తెచ్చారు. సంపన్నులు పది శాతం ఉంటే పేదరికం ఎక్కువ శాతం ఉంది కాబట్టి వారిని ఆదుకునేందుక ఈ పథకాన్ని తెచ్చారు.మొన్న ఉగాది నాడు పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు అమరావతిలో ప్రారంభించారు. అయితే ఆశించిన రీతిలో ఇప్పటి వరకూ పెద్దగా రెస్పాన్స్ రాకపోవడంతో చంద్రబాబు పీ4 పథకానికి సంపన్నులు ఆకట్టుకునేలా చర్యలు తీసుకునేందుకు ప్రజాప్రతినిధులతో పాటు తనకు సుదీర్ఘకాలం నుంచి సహకారం అందిస్తూ వస్తున్న పారిశ్రామిక వేత్తలకు అప్పగించారు. వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి కనీసం ఐదు లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఆన్ లైన్ ద్వారా సంపన్నులు నేరుగా పేదలను ఆదుకునేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.నియోజకవర్గాల వారిలో ప్రధానంగా సంపన్నులను గురించి పీ4 పథకానికి సాయం అందించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ వంతుగా ప్రయత్నం చేయాలని కోరారు. ఇది ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలని ప్రజాప్రతినిధులను ఆదేశించారు. వచ్చే ఉగాది పండగ నాటికి ఎంత మేర బంగారు కుటుంబాలకు లబ్ది జరిగింది? సంపన్నుల పేర్లతో పాటు పారదర్శకంగా వివరాలను వెల్లడించి ఈ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా అవసరమైన చర్యలు సత్వరం ప్రారంభించాలని గట్టిగా కోరారు. తర్వాత పథకం దానంతట అదే విస్తృతంగా డెవెలెప్ అవుతుందని చంద్రబాబు గట్టిగా నమ్ముతున్నారు.ముఖ్యంగా పేదరికంలో మగ్గుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని బంగారు కుటుంబాల కింద ఎంపిక చేస్తే వారు కూడా పార్టీ జెండా దించకుండా మరింతగా రాజకీయంగా ఉపయోగపడతారని చంద్రబాబు వేస్తున్న అంచనాలు వర్క్ అవుట్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. దీంతో పాటు వచ్చే ఏడాది కూడా మరో కొత్త పథకంతో జనం ముందుకు రావాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఇప్పటికే చంద్రబాబు థింక్ ట్యాంక్ నాలుగైదు పథకాలకు రూపకల్పన చేసినట్లు సమాచారం. ప్రజలు ఎక్కువ శాతం మంది లబ్ది పొందేలా మరొక కొత్త పథకాన్ని చంద్రబాబు తెచ్చేయోచనలో ఉన్నారు.

# దేశంలో నీటియాజామన్య లోపం..!

న్యూఢిల్లీ: వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవడం లేదు. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్ధతలను అవలంబించడం లేదు. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నా నిర్లక్ష్యంతో ప్రజలను బలి చేస్తున్నారు. వరదలతో సామాన్యులు నిండా మునిగినా పాలకుల్లో చలనం రావడం లేదు. దేశంలో జాతీయ జలవిధానం కూడా అమలు కావడం లేదు. ప్రధాని మోడీ నదుల అనుసంధానం గురించి గొప్పలు చెప్పినా పదకొండేళ్లుగా ఆయనకూడా చేసింది శూన్యమనే చెప్పాలి. వరద ప్రాంతాల ప్రజలకు పక్కా ఇళ్లు నిర్మించి వారు వరద బారినపడకుండా చేయడం లేదు. వివిధ రాష్ట్రాల్లో చెరువుల ను మింగిన పాపానికి ఇటీవల కురిసిన వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు.ఈక్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. గతంలో ఎప్పుడూ లేనంతగా దేశంలో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్నతేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరుసముద్రానికి చేరింది.తాజాగా కూడా అలాంటి పరిస్థితిని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి.జలవిధానంకూడా అవసరమని గుర్తించాలి. జలవిధానం తోనదులనుదారి మళ్లించగలిగితే నీటి కటకటలు రావు.

# అరణి శ్రీనివాస్ కు తప్పని పాత వాసనలు!

**తిరుపతి,తెలంగాణ దిశ :** తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహంగా ఉన్నట్లు కనిపిస్తుంది. వైసీపీ నుంచి వచ్చి పార్టీలో చేరినా ఆరణి శ్రీనివాసులకు తిరుపతి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. టీడీపీ బలంగా ఉన్నప్పటికీ, అక్కడ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తనకు కావాలని గట్టిగా కోరినప్పటికీ పవన్ కల్యాణ్ తిరుపతి నియోజకవర్గం సీటును పట్టుబట్టి జనసేన ఖాతాలో వేసుకున్నారు. పొత్తులో భాగంగా రాయలసీమలోని తిరుపతితో పాటు రైల్వే కోడూరు నియోజకవర్గాలను ఎంచుకున్నారు. చంద్రబాబు నాయుడు కూడా నాడు పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారు. దీంతో కూటమి గాలిలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైసీపీ నుంచి జనసేనలోకి గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా వైసీపీలో ఉన్న ఆయన పార్టీ మారి తిరుపతి జనసేన ఎమ్మెల్యే అయ్యారు.కానీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరణి శ్రీనివాసులు పార్టీ క్యాడర్ ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ, జనసేన క్యాడర్ ను పక్కన పెట్టి కొందరు వైసీపీ నేతలకు టచ్‌లో ఉన్నారంటూ ఆరో?పణలు పలు దఫాలు ఎదుర్కొన్నారు.

## ఆ పది రాష్ట్రాలకే

# సంపన్నులు పరిమితం..

**- అక్కడే అభివృద్ధి కేంద్రీకృతం**
**- మిగిలిన భారతావనిలో అన్నీ సమస్యలే**
**- దేశంలో పెరిగిపోతున్న అంతరాలు**




న్యూఢిల్లీ : దేశంలో 1,687 మందికి వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపద ఉంది. అలాగే 358 మంది వద్ద ఎనిమిదిన్నర వేల కోట్ల సంపద పోగుపడి ఉంది. వీరందరి వద్ద కలిపి ఉన్న సంపద భారత జీడీపీలో దాదాపు సగానికి సమానమని హూరన్ ఇండియా రిచ్ తాజా జాబితా తెలిపింది. ఈ గణాంకాలు దేశానికి గర్వకారణమని అనిపిస్తోంది కదూ ! కానీ నాణేనికి మరో వైపు కూడా చూస్తే చేదునిజాలు బయటపడతాయి. కనిపిస్తున్న సుందర దృశ్యం అదృశ్య మవుతుంది. ఈ సంపద అంతా దాదాపుగా దేశంలోని కొన్ని ప్రాంతా లలోనే కన్పిస్తుంది. భారతదేశానికి చెందిన మిలియనీర్ కుటుంబాల లో సగానికి పైగా కుటుంబాలు మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక, గుజరాత్‌లోనే ఉండడం గమనార్హం. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా.. వీటిని కూడా కలుపుకుంటే భారత వృద్ధిలో 90శాతం ఈ పది రాష్ట్రాలలోనే మనకు కన్పిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్ నగరాలలోనే సంపద సృష్టి జరుగుతోంది. మిగిలిన ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. హూరన్ నివేదికను పరిశీలిస్తే పరస్పర విరుద్ధమైన అంశాలు ఎన్నో కన్పిస్తాయి. అది కేవలం సంపన్నుల జాబితా మాత్రమే కాదు. దేశంలో అభివృద్ధి ఎక్కడ కేంద్రీకృతమైంది, అది ఇంకా ఎక్కడ కన్పించడం లేదు అనే అంశాలను కూడా ఆ నివేదిక స్పృశించింది. కొన్ని రాష్ట్రాలలోనేఎందుకు కేంద్రీకృతం?: సంపద ఎక్కడఉంటే అక్కడ అవకాశాలు లభిస్తాయని చెబుతుంటారు. మహారాష్ట్రలో వాణిజ్య రాజధాని ముంబయి ఉంది. ఆ రాష్ట్రంలో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపద ఉన్న వారు 548 మంది. అంటే దేశంలో ఉన్న సంపన్నుల్లో సగం మంది మహారాష్ట్రలోనే ఉన్నారన్న మాట. ఢిల్లీలో 223 మంది సంపన్నులు ఉండగా కర్నాటక, గుజరాత్, తమిళనాడు, తెలంగాణలో మిగిలిన వారు నివసిస్తున్నారు. దీనిని బట్టి అర్థమవుతున్న విషయం ఏమిటంటే ఎక్కడ డబ్బు ఉంటే అక్కడ వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. మౌలిక సదుపాయాలు ఉంటాయి. పెట్టుబడిదారులకు విశ్వాసం కలుగుతుంది. ముంబయి లేదా బెంగళూరులో వ్యాపారం ప్రారంభించాలని అనుకుంటే పెట్టుబడిని సమీకరించడం సులభం. నిపుణులైన సిబ్బంది లభిస్తారు. డబ్బు ఖర్చు చేసే వినియోగదదారులూ దొరుకుతారు. అదే ఇండోర్‌లోనో పాట్నాలోనూ వ్యాపారం చేస్తే అభివృద్ధి చెందడానికి చాలా కాలం పడుతుంది. ఏం తయారు చేస్తున్నామన్న దాని కంటే ఎక్కడ తయారు చేస్తున్నామన్నదే ముఖ్యమని ఓ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ యజమాని వ్యాఖ్యానించారు.

# "హ్యాండ్" ఇస్తారా అండగా నిలబడతారా..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై జనాభి ప్రాయం తెలిపే ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపైనే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పబోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండేళ్లు దాటి పోయింది. ఈ రెండేళ్లలో ఒకే ఒక ఉప ఎన్నిక జరిగింది. కంటోన్మెంట్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ అది అధికారంలో ఉన్న పార్టీపై ప్రజలు మొగ్గు చూపారని అనుకోవాలి. కానీ నేడు అలా కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్నాయి. పల్లెలు, పట్టణాలలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకో నున్నారు. అయితే ఈ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమని చెప్పాలి. ఎందుకంటే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంతో పాటు ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు జరిపారన్న దానిపైనే ఈ ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేసే అవకాశముంది. ప్రధానంగా రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాన్నిఅమలు చేసినప్పటికీ యూరియా కొరత కొంత రైతుల్లో అసంతృప్తి ఉంది. మరొకవైపు ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఈ ప్రభుత్వంలో బాగానే విడుదలయ్యాయి. అయినా నిరుద్యోగ యువతలో ఎంత మేరకు అసంతృప్తి ఉందన్నది ఈ ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టమవుతుందిఇక ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేసింది. ఇది తమకు పాజిటివ్ గా ఓటింగ్ ఉంటుందని కాంగ్రెస్ నేతలు అంచనా వేసుకుంటున్నారు. మరొకవైపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కూడా ఒకరకంగా తమకు అనుకూలంగా మారతాయని భావిస్తున్నారు. అయితే ఇచ్చిన హామీలు ఎంతమందికి అమలయ్యాయి ఎంత మంది లబ్ది పొందారు గత ప్రభుత్వం లో లబ్ది పొందిన వారితో పాటు ఈ ప్రభుత్వంలో మరికొంత మంది ప్రయోజనం పొందారా లేక కోత విధించారా అనేది ఫలితాలను బట్టి వెల్లడవుతుంది. గత ప్రభుత్వంలో కల్యాణ లక్ష్మి పథకం అమలయ్యేది. ఇలా కొన్ని హామీలను అమలు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుంది. మరి ప్రజలు హ్యాండ్ ఇస్తారా కాంగ్రెస్ కు అండగా నిలబడతారా అన్నదిఎన్నికల ఫలితాల మాత్రమే తెలియనుంది.రాష్ట్రంలోని 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 12,733 పంచయతీలకు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.తెలంగాణలో నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. తెలంగాణలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు 1.12 లక్షల పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల రెండో విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 31 న తొలి విడత పోలింగ్ జరగనుంది. పంచాయతీలకు రెండో విడత పోలింగ్ నవంబరు నాలుగో తేదీన, మూడో విడత నవంబరు 8వ తేదీన నిర్వహించనున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నవంబరు 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జరగనుంది.

# మధురవనం దోపిడీ..!


**నల్గొండ,తెలంగాణ దిశ :**అది కొండమల్లేపల్లిలోని మండలంలోని కోల్ముంతల్‌పహాడ్ గ్రామం. పైగా హైదరాబాద్– నాగార్జునసాగర్ హైవే. ఇంకేముందీ పచ్చని భూముల్ని వెంచర్లుగా మార్చేసి.. రంగురంగుల బ్రోచర్లతో కస్టమర్లను బురిడీ కొట్టించి.. ఆఫర్ల పేరుతో ప్లాట్లను అంటగడుతున్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో విజన్ ఇన్‌ఫ్రా డవలపర్స్ భారీ ఫామ్ లాండ్ దందాకు తేరలేపింది.మధురవనం పేరుతో ఏకంగా 243 ఫామ్ ల్యాండ్ ప్లాట్లను వెంచర్‌గా చేసి విక్రయాలను మొదలుపెట్టింది. అయితే సదరు వెంచర్ ఏర్పాటుకు కనీస అనుమతులు లేకపోవడం గమనార్హం. అయితే ఈ ఫామ్ ల్యాండ్ అక్రమ దందాకు రెవెన్యూ యంత్రాంగం వంతపాడుతుండడం కొసమెరుపు. వ్యవసాయ భూమిని గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయం వేదిక అయ్యింది. ఇంత జరుగుతున్నా.. జిల్లా రెవెన్యూ యంత్రాంగం మొద్దు నిద్రను వీడడం లేదు.కొండమల్లేపల్లి మండలంలోని కోల్ముంతల్‌పహాడ్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 89,90,92,93ల్లో విజన్ ఇన్‌ఫ్రా డవలపర్స్ఆధ్వర్యంలో మధురవనం పేరుఫ్యామ్ ల్యాండ్ వెంచర్ ఏర్పాటయ్యింది. ఈ వెంచర్‌లో ఒక గుంట దగ్గరి నుంచి మొదలు పెడితే.. ఐదారుగుంటల వరకు గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. నిజానికి డీటీసీపీ, రేరా వంటి అనుమతులేవి లేకుండానే ఫామ్‌ల్యాండ్ ప్లాట్ల విక్రయాలు జోరందుకున్నాయి. అయితే సదరు వెంచర్ యాజమాన్యం ఇందులో కొత్త తరహా దందాకు తేరలేపింది. రిజిస్ట్రేషన్లు గుంటల్లో చేస్తున్నప్పటికీ.. అమ్మకాలు మాత్రం గజాల లెక్కన డబ్బులు దండుకుంటుండడం గమనార్హం. అయితే ప్రతి ఆదివారం స్పెషల్ ఆఫర్ పేరుతో కస్టమర్లను వెంచర్ వద్దకు తీసుకొచ్చి నాన్‌వెజ్ భోజనం.. రంగురంగుల బ్రోచర్లతో బురిడీ కొట్టించి ప్లాట్లను అంటగట్టేస్తున్నారు.పైగా హైదరాబాద్– నాగార్జునసాగర్‌హైవే కావడంతో హైదరాబాద్ మహానగరంతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా కేంద్రాల నుంచి సైతం కస్టమర్లను కార్లలో తరలించి ప్లాట్లు కొనుగోలు చేసేలా మాయమాటలు చెబుతుండడం కొసమెరుపు.హైదరాబాద్ –నాగార్జునసాగర్ హైవేదే భవిష్యత్ అంతా.. ఫ్యూచర్‌లో ఇక్కడ సైతం ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ వంటివి రాబోతున్నాయి. హైదరాబాద్ చుట్టూ పక్కలా భూమి అయిపోయింది. ఇక మిగిలింది ఈ హైవేకే. పైగా నాగార్జునసాగర్ ప్రాజెక్టును హైదరాబాద్ మహానగరం భవిష్యత్‌లో పర్యాటకంగా కలిసిపోయే పరిస్థితి వస్తుందంటూ కస్టమర్లను గాలిలోనే మేడలు కట్టేలాచేస్తున్నారు.వాస్తవానికి సగటు సామాన్యుడు భవిష్యత్ అవసరాల కోసం.. పిల్లల ఫ్యూచర్ కోసం మాత్రమే ప్లాట్లను కొనుగోలు చేస్తుంటారు. ఆ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని కస్టమర్లు ప్లాట్లు బుక్ చేసేవరకు వదలడం లేదు.ఈ దందాలో ఏజెంట్లు, దళారులకు భారీగా కమీషన్లు ఇస్తుండడంతో ప్రైవేటు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇదే పనిచేస్తూ తొటి ఉద్యోగులు, బంధువులు, స్నేహితులకు అక్రమ ప్లాట్లను అంటగడుతున్నారు. తీరా ఆ ఫాట్లలో ఇల్లు కట్టుకోవాలంటే.. మస్తు తిప్పలు పడాల్సి వస్తుంది.

# ఏ బియ్యం మేలు?!




ప్రపంచంలోనే అత్యధికమంది బియ్యాన్నే ప్రధాన ఆహారంగా తీసుకుంటారు. అయితే, ఎక్కువగా తెల్లని పాలిష్ చేసిన బియ్యానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మరికొందరు ఆరోగ్యానికి మంచిదని దంపుడు బియ్యాన్ని వండుకుంటారు. ఈ క్రమంలో.. ఏరకమైన బియ్యంతో ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో నిపుణులు వివరిస్తున్నారు. పాలిష్ చేసిన బియ్యంలో విటమిన్ బి1 (థయామిన్) ఉండదు. దాంతో నాడీ వ్యవస్థ, గుండె పనితీరుపై ప్రభావం చూపే 'బెరిబెరి' వ్యాధి ముప్పు ఉంటుందట. పాలిష్ బియ్యంతో కార్బొహైడ్రేట్స్ అధికంగా అందుతాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయులను పెంచుతాయి. ఇక వీటిలో ఫైబర్ చాలా తక్కువ. ఈ బియ్యంతో వండిన అన్నం ఎంతతిన్నా.. కడుపు నిండినట్లుగా అనిపించదు. మళ్లీమళ్లీ ఆకలి అవుతుంటుంది. ఫలితంగా, బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ఇక ఫైబర్ లోపంవల్ల అజీర్ణం, కడుపు ఉబ్బరం, యాసిడ్ రిఫ్లెక్స్ వంటి జీర్ణ సమస్యలూ వస్తాయి. పోషకాలు తక్కువగా ఉండటం వల్ల కీళ్లకు సరైన పోషణ అందించవు. దంపుడు బియ్యంలో..: దంపుడు బియ్యానికి ఉండే తవుడు పొరలో.. విటమిన్లు, ఖనిజాలు అధికంగా లభిస్తాయి. వీటిని రెగ్యులర్‌గా తీసుకుంటే మధుమేహం ముప్పు గణనీయంగా తగ్గుతుంది. సోడియం తక్కువగా ఉండటం వల్ల.. రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇక ఆహారాన్ని శక్తిగా మలచడంలో కీలకపాత్ర పోషించే నియాసిన్, విటమిన్ బి3.. దంపుడు బియ్యంలో పుష్కలంగా లభిస్తాయి. ఇందులో అధిక మొత్తంలో లభించే క్యాల్షియం, మెగ్నీషియం.. ఎముకల ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. దంపుడు బియ్యం నెమ్మదిగా జీర్ణం కావడం వల్ల వెంట వెంటనే ఆకలి వేయదు. బరువు తగ్గాలని అనుకునేవారికి మంచిది. ఇందులోని ఫైబర్.. జీవక్రియలు సాఫీగా సాగేందుకు దోహదం చేస్తుంది. శరీరాన్ని డీటాక్స్ చేయడంలోనూ ముందుంటుంది. దంపుడు బియ్యంలోని పోషకాలు.. శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.

# ఆదిలోనే హంసపాదు!



ఎన్నో ఆశలతో కార్పొరేట్ సంస్థల్లో చేరుతున్న యువతులకు ఆదిలోనే హంసపాదు ఎదురవుతున్నది. అనేకచోట్ల ఉద్యోగాల్లో లింగ వివక్ష కనిపిస్తున్నది. సమాన అవకాశం, లింగ సమానత్వం అనేది.. అందని ద్రాక్షగానే మిగులుతున్నది. ఈ విషయాన్ని 'లీన్ ఇన్-మెకిన్సే అండ్ కంపెనీ' తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం బయటపెట్టింది. ఉమెన్స్ వర్క్‌ప్లేస్‌పై చేపట్టిన సర్వే.. ఇందుకు సంబంధించిన విషయాలను వెల్లడించింది. పురుషులతో సమానమైన తెలివితేటలు, పట్టుదల, ధైర్యసాహసాలు, ఉద్యోగంలో రాణించాలన్న తపన ఉన్నప్పటికీ.. ఆడవాళ్లపై వివక్ష కొనసాగుతూనే ఉన్నదని తేల్చింది. ప్రతీ సంస్థలోనూ పురుషులతో సమానంగా ఉత్తమ ప్రదర్శన ఇవ్వడానికి మహిళలు కూడా ఆసక్తి చూపుతున్నారు. అయినప్పటికీ.. ప్రమోషన్లు, ఇతర నాయకత్వ బాధ్యతలను అప్పగించడానికి సంస్థలు ఆసక్తి చూపడంలే దట. మహిళల కెరీర్ పురోగతి, స్పాన్సర్‌షిప్ లాంటివి అందించడానికీ వెనకాడుతున్నాయట. అందులోనూ కెరీర్ ప్రారంభంలో ఉన్న యువతపై మరింత నిర్లక్ష్యం చూపుతున్నాయని సర్వేలో తేలింది. ముఖ్యంగా 30 ఏళ్లలోపు యువతులను ప్రమోషన్లు, కీలక బాధ్యతల కోసం నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టేస్తున్నారు. సర్వే వివరాల ప్రకారం.. ఎంట్రీ లెవల్ మేనేజర్లలో మూడింట ఒక వంతు మంది మాత్రమే మహిళలు ఉన్నారు. కొత్తగా కెరీర్‌ను ప్రారంభించిన మహిళల్లో కేవలం 31% మందికి మాత్రమే స్పాన్సర్‌షిప్ అందిస్తున్నారు. అదే దశలో పురుషులలో 45% మందికి స్పాన్సర్స్ ఉన్నారు. ఇలా కెరీర్ ప్రారంభంలోనే అవకాశాలను కోల్పోవడం.. మహిళల ఉద్యోగ కెరీర్‌పై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని అధ్యయనకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎంట్రీ లెవల్ ఉద్యోగుల్లో రిమోట్ వర్క్ కోసం మహిళలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనివల్ల ఉపయోగం కంటే.. నష్టమే ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇలా రిమోట్ వర్క్ చేసేవారికి ప్రమోషన్ రేట్లు తగ్గుతాయని చెబుతున్నారు. అదే సమయంలో, పురుషుల ప్రమోషన్ రేట్లు మాత్రం స్థిరంగా ఉంటున్నాయట. వివక్షతోపాటు ఈ నివేదిక మరో ఆధునిక ముప్పును కూడా హైలైట్ చేసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఏఐ సాధనాలను నేర్చుకోవడానికి, ఉపయోగించడానికి.. మహిళలకు కనీస మద్దతు లభించడం లేదట. ఈ కీలకమైన రంగంలో మహిళలపై వివక్ష కారణంగా.. వారు మరింత వెనుకబడిపోయే ప్రమాదం ఉన్నది. ఏఐతోపాటు ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను అందిపుచ్చుకుంటే.. వారి కెరీర్ దూసుకెళ్లే అవకాశం ఉంటుంది. కానీ, కార్పొరేట్ సంస్థలు చూపుతున్న అసమానత వల్ల.. ఆడవాళ్ల ఆశలు, ఆశయాలు అడియాసలే అవుతున్నాయి.

# నిమిషాల్లో చిల్ అవుట్! షరతులు వర్తిస్తాయ్

ఈ రోజుల్లో పదిమందిని పలకరిస్తే.. ఎనిమిది మంది మూడ్ బాగోలేదు బాస్ అనే సమాధానం ఇస్తున్నారు. కారణం.. లైఫ్ స్టయిల్ ఒకటైతే, సెల్‌ఫోన్ మరొకటి. మనం చిల్ అవుట్ కాకుండా.. ప్రధానంగా అడ్డంకి పడుతున్నవి ఇవే! ఈ రెండు సలహాలు పాటించి చూడండి.. కొంతలో కొంతైనా మూడ్ ఆన్ అవుతుంది.


లైట్స్ ఆఫ్.. సన్ లైట్ ఆన్

సమస్య: యాంత్రికంగా సాగిపోతున్న లైఫ్‌లో బాగా మిస్ అయ్యేది.. సన్‌లైట్. ఎందుకంటే.. పని ఒత్తిడిలో సతమతమయ్యే చాలామంది ఎండ కన్నెరగనంతగా బిజీ అయిపోతున్నారు. నిత్యం ఏసీల్లో మగ్గిపోతున్నారు. పగలు కూడా ఎల్ఈడీ కాంతుల్లోనే గడిపేస్తున్నారు. ఇవన్నీ డిప్రెషన్‌కి దారి తీస్తున్నాయి.

పరిష్కారం: రోజులో కాసేపైనా సూర్యరశ్మికి ఎక్స్‌పోజ్ అయితే డిప్రెషన్ నుంచి బయటపడొచ్చని జర్నల్ ఆఫ్ ఎఫెక్టివ్ డిసార్డర్స్ నివేదిక తెలియజేసింది. ఉదయాన్నే.. డాబా పైకి వెళ్లి ఒక అరగంట సూర్యరశ్మిలో గడపాలి. దీంతో మూడ్ అంతా సెట్ అవుతుంది. డాబా పైకి వెళ్లేంత తీరిక లేదంటే.. ఇంట్లోనే సూర్య కిరణాలు పడే చోట కూర్చోండి.

షరతులు: సూర్యరశ్మి కోసం బయటికి వెళ్లినప్పుడు.. టోపీ పెట్టుకోవడం, గొడుగు పట్టుకోవడం లాంటివి చేయొద్దు.

సమస్య: సెల్‌ఫోన్ మన శరీరంలో ఒక భాగంగా మారిపోయింది.



నిద్ర వేళలు మినహాయిస్తే నిరంతరం సెల్‌లోనే ఉంటున్నారు చాలామంది. ఇది మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. సమయాన్ని వృథా చేస్తుంది.

పరిష్కారం: సెల్‌ఫోన్‌ను పక్కన పెట్టేయడమే సొల్యూషన్. బలవంతంగా అవాయిడ్ చేయడానికి ఇంట్లో ఫోన్ పెట్టేసి.. ఓ అరగంట బయట వాకింగ్ చేయండి. ఈ చిన్న నడక ఎండార్ఫిన్స్‌ను పెంచి మెదడును రీసెట్ చేస్తుంది. శారీరక శ్రమ మూడ్‌ను మెరుగుపరుస్తుంది.

షరతులు: తినేటప్పుడు ఫోన్ చూడొద్దు. పడుకోవడానికి మంచం ఎక్కడానికి ముందే.. మీ ఫోన్ గూట్లో విశ్రాంతి తీసుకోవాలి.

# నాన్ వెజ్ లేదా వెజ్.. రెండింటిలో ఏ ఆహారాలు మనకు ఎక్కువ మేలు చేస్తాయి..?

మనలో చాలా మంది జంతు సంబంధిత మాంసాహారాన్ని, మొక్కల ఆధారిత శాకాహారాన్ని కలిపి తీసుకుంటారు. మన శరీరానికి కావల్సిన పోషకాలు అన్నీ అందాలంటే వీటిని కలిపి తీసుకోవడం చాలా అవసరం. అప్పుడే మనకు పోషకాహార లోపం వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. అయితే మాంసాహారాలు, శాకాహారాలు రెండూ మన ఆరోగ్యానికి అవసరమైనవే అయినప్పటికీ వీటిలో దేనిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎక్కువ మేలు కలుగుతుందనే సందేహాలు మనకు వస్తూనే ఉంటాయి. మాంసాహారాల్లో ప్రోటీన్స్‌తో పాటు పోషకాలు కూడా అధికంగా ఉంటాయి. అలాగే వీటిలో శరీరానికి హానిని కలిగించే కొలెస్ట్రాల్ కూడా ఎక్కువగా ఉంటుంది. ప్రాంతాన్ని బట్టి మాంసాహారులు తీసుకునే ఆహారంలో మార్పులు వస్తూ ఉంటాయి. ఇక శాకాహార ఆహారాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్స్, మినరల్స్ అధికంగా ఉంటాయి. శాకాహార ఆహారాలు కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆరోగ్యానికి మేలు చేసే విషయంలో ఈ రెండు రకాల ఆహారాలను సమర్థించే వారు కూడా ఉన్నారు. అయితే మాంసాహారం, శాకాహారాల్లో ఏది శ్రేష్ఠమైనది, దేనిని తీసుకోవడం వల్ల మనం ఎక్కువ ప్రయోజనాలను పొందవచ్చు అన్న వివరాలను పోషకాహార నిపుణులు వెల్లడిస్తున్నారు.

మాంసాహారాలు అయితే..: మాంసాహార ఆహారాల్లో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన ప్రోటీన్ లభిస్తుంది. అంతేకాకుండా వీటిలో ఉండే అమైనో ఆమ్లాలు కండరాల అభివృద్ధికి, రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, శరీర మరమ్మత్తుకు సహాయపడతాయి. జంతు సంబంధిత ఉత్పత్తులల్లో ఐరన్, జింక్, విటమిన్ బి12, ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, జీవక్రియల వేగం పెంచడంలో సహాయపడతాయి. మాంసాహారాన్ని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. తద్వారా శరీర బరువు కూడా అదుపులోఉంటుంది.

# సినిమా..


## యంగ్ హీరోయిన్ కృతి శెట్టి భయానక అనుభవం..

## "నా రూమ్‌లో ఆత్మ కనిపించింది" అంటూ కామెంట్




యువ కథానాయిక కృతి శెట్టి ఇటీవల ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెన్నులో వణుకు పుట్టించే అనుభవాన్ని పంచుకున్నారు. సినిమా షూటింగ్‌కు ఒక్క రోజు ముందు హోటల్ రూమ్‌లో తనకూ, తన అమ్మకూ ఆత్మలాంటి ఆకారం కనిపించిందని పేర్కొన్నారు. ఈ సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'ఉప్పెన' చిత్రంతో ఒక్కసారిగా స్టార్‌డమ్ అందుకున్న కృతి శెట్టి, తరువాత వరుస సినిమాల్లో నటించినప్పటికీ పెద్ద విజయాలు అందుకోలేకపోయింది. దీంతో తమిళం, మలయాళం రంగాల్లో అవకాశాలపై దృష్టి పెట్టిన ఆమె ప్రస్తుతం కార్తీ హీరోగా నటించిన వా వాతియర్ (తెలుగులో 'అన్నగారు వస్తారు') మూవీ ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఈ క్రమంలో కృతి మాట్లాడుతూ.. అన్నగారు వస్తారు షూటింగ్‌కు ఒక రోజు ముందు నేను, మా అమ్మ హోటల్‌లో ఉండగా ఆత్మ లాంటి ఆకారం కనిపించిందని చెప్పింది. వెంటనే లైట్ ఆన్ చేయగానే పెద్ద శబ్దంతో ఆ ఆకారం మాయమైందని చెప్పింది. తుళు సంస్కృతికి చెందినవారమైన తమ ఇంట్లో పూర్వీకులను దైవంలా పూజించే సంప్రదాయం ఉందని, ఇలాంటి అతీత శక్తులపై విశ్వాసం ఎప్పటినుంచో ఉందని పేర్కొన్నారు. ఈ సంఘటనతో తన విశ్వాసం మరింత పెరిగిందని చెప్పారు. 'అన్నగారు వస్తారు' సినిమాలో కృతిశెట్టి పాత్ర ఆత్మలతో మాట్లాడే పాత్రగా ఉండటం వల్ల ఆమె ఈ అనుభవాన్ని ప్రమోషన్ కోసమే చెప్పిందా? లేక నిజంగానే ఆత్మను చూసిందా? అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. త్వరలోనే సినిమా విడుదల కానుండటంతో కృతి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. సినిమా ప్రమోషన్ కోసం సృష్టించిన హైపా,లేక నిజంగా అనుభవించిన ఘటననా? అనేది మాత్రం రాబోయే రోజుల్లో తెలియనుంది. కొన్నాళ్లుగా మంచి హిట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న కృతి శెట్టికి ఈ చిత్రం మంచి విజయం దక్కాలని ఆమె అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# సక్సెస్ లేకపోతే ఎవరైనా 'జీరో'నే: నటి ఇంద్రజ



1990లలో కథానాయికగా వెండితెరపై సందడి చేసిన అందాల తార ఇంద్రజ. హీరోయిన్స్ మధ్య గట్టి పోటీ నడుస్తున్న సమయంలో ఆమె ఎంట్రీ ఇచ్చారు. తనకి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రస్తుతం ఆమె కేరక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేస్తూ బిజీగానే ఉన్నారు. తాజాగా 'బిగ్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. " నాకు ఊహ తెలిసే సమయానికే మా అమ్మ హార్ట్ పేషంట్. ఒకసారి అమ్మకి అత్యవసరంగా సర్జరీ చేయించవలసి వచ్చింది. నా కంటే చిన్నవాళ్లయిన చెల్లెళ్లు ఏమీ చేయలేని పరిస్థితి. అప్పటికి నేను ఒక సినిమాలో చేస్తున్నాను. వాళ్లకి పరిస్థితి చెప్పినా, నాకు ఇవ్వవలసిన డబ్బు కూడా ఇవ్వలేదు. చివరికి మా పరిస్థితికి జాలిపడి ఇద్దరు డాక్టర్లు సర్జరీ పూర్తి చేశారు. ఆ తరువాత నిదానంగా డబ్బు సర్దుబాటు చేశాము. అందువలన నన్ను ఎవరైనా సాయం అడిగితే కాదనలేను" అని అన్నారు. "ఇప్పుడు రోజులు మారిపోయాయి. ఎవరికైతే మంచి జరగాలని కోరుకుంటూ సాయం చేస్తున్నామో .. వాళ్ల నుంచే మనం ఎదురుదెబ్బలు తినవలసి వస్తోంది. ఇలాంటి సంఘటనల వల్లనే మనుషుల మీద మనుషులకు నమ్మకం పోతోంది .. 'మనీ' మీద ఉన్న ప్రేమ అంతకంతకూ పెరిగిపోతోంది. ఎంత గుణవంతులైనా .. ఎంత చదువుకున్నా .. ఎంత ప్రతిభ ఉన్నా డబ్బులేకపోతే 'జీరో'గానే చూస్తారు. ఇప్పుడు ఎవరైనా సరే మనతో కాదు, మన సక్సెస్ తో .. మన స్టేటస్ తో మాత్రమే మాట్లాడుతున్నారు" అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# ఇది ధనుష్‌కు మాత్రమే సొంతమైన ఘనత



ఒక స్టార్ హీరో నుంచి ఒకే ఏడాది మూడు సినిమాలు రిలీజ్ కావడమే అరుదైన విషయం. అలాంటిది వేర్వేరు భాషల్లో ఆ మూడు సినిమాలు చేయడం.. ఆ మూడూ ఆయా భాషల్లో విజయవంతం కావడం ఇంకా అరుదైన ఘనతే. తమిళ స్టార్ హీరో ధనుష్‌కు ఈ రికార్డు సొంతమైంది. అతను ఈ ఏడాది జూన్‌లో 'కుబేర' చిత్రంతో పలకరించాడు. 'సార్' తర్వాత అతను చేసిన రెండో తెలుగు చిత్రమిది. శేఖర్ కమ్ముల రూపొందించిన ఈ చిత్రం తెలుగులో మంచి విజయం సాధించింది. తమిళంలో మాత్రం 'కుబేర' సరిగా ఆడలేదు. స్టార్‌పవర్ లేకపోతే అంతేగా! ఆ తర్వాత ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇడ్లీ కడై' సినిమా అక్టోబరు మొదటి వారంలో రిలీజైంది. ఆ చిత్రం తెలుగులో కూడా విడుదలైనప్పటికీ.. ఇక్కడ సరిగా ఆడలేదు. కానీ ధనుష్ సొంత భాష అయిన తమిళంలో పెద్ద హిట్టే అయింది. ఓటీటీలోకి వచ్చాక ఈ సినిమాకు మరింత ఆదరణ దక్కింది. దర్శకుడిగా వరుసగా నాలుగో చిత్రంతోనూ అతను సక్సెస్ అందుకున్నాడు. ఇప్పుడిక 'తేరే ఇష్క్ మే' సినిమాతో ధనుష్ హిందీలో కూడా జయకేతనం ఎగురవేశాడు. తనకు 'రాన్‌జానా' రూపంలో మరపురాని సినిమాను అందించిన ఆనంద్.ఎల్.రాయ్ దర్శకత్వంలో ధనుష్ నటించిన చిత్రమిది. కృతి సనన్ కథానాయిక. ఇంటెన్స్ టీజర్, ట్రైలర్‌లతో ఆకట్టుకున్న 'తేరే ఇష్క్ మే' గత శుక్రవారమే మంచి అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రానికి పాజిటివ్ రివ్యూలు, టాక్ వచ్చాయి. తొలి రోజు ఇండియాలో రూ.15 కోట్ల నెట్ వసూళ్లతో 'తేరే ఇష్క్ మే' మంచి ఓపెనింగ్ వచ్చింది. తర్వాతి రెండు రోజుల్లోనూ ఈ సినిమా కలెక్షన్లు స్టడీగా ఉన్నాయి. ఫస్ట్ వీకెండ్లో ఇండియా వరకే హాఫ్ సెంచరీ కొట్టింది 'తేరే ఇష్క్ మే'. వీకెండ్ తర్వాత కూడా సినిమాకు మంచి రెస్పాన్సే వస్తోంది. ధనుష్‌కు బాలీవుడ్లో మరో హిట్ పడిందన్నది స్పష్టం. ఈ సినిమాలో తన నటనకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. ఇలా ఒకే ఏడాది ఒక హీరో మూడు భాషల్లో హిట్లు కొట్టడం ఒక రికార్డని చెప్పొచ్చు. దీన్ని ఇంకెవ్వరూ బద్దలు కొట్టలేరేమో.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215